teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 370 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 14 మే 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగాయి



భారీ బందోబస్తుతో స్ట్రాంగ్‌రూమ్స్‌లో ఈవీఎంలను భద్రపరుస్తాం

సీ విజిల్ యాప్ ద్వారా 225 ఫిర్యాదులు

రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ వెల్లడి

హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగాయని రాష్ట్ర ఎన్నికల అధికారి (సీఈవో) వికాస్ రాజ్ వెల్లడించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తలేదన్నారు. మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా వచ్చారని పేర్కొన్నారు. ఉదయం నుంచి పోలింగ్ మంచిగా జరిగిందన్నారు. తెలంగాణలో సాయంత్రం 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్ నమోదైందని

మిగతా 2 లో

## పన్నుల భారంతో ఆర్థికమాంద్యం

### ప్రజల్లో తగ్గుతున్న కొనుగోలు శక్తి..చమురు ధరలతో ఆర్థికంగా దెబ్బ




యుద్ధాలు, అంతర్జాతీయ పరిణమాల కారణంగా చమురు, సహజవాయువుల ధరలు విపరీతంగగా పెంచుతూ పోవడం వల్ల దేశంలో తయారీరంగం కుదేలయ్యింది. అలాగే ధరల పెరుగుదలకు కారణమయ్యింది. ఈ ధరలపై పన్నుల వసూళ్లు కూడా పెంచడంతో మరింతగా ఆర్థిక రంగం కుదేవలుతూ వస్తోంది. దీనికి పరిస్కారం కనుగొనకుండా ఆదాయ మార్గం పెరిగిందన్న ధోరణిలో కేంద్రం ఉ ంది. ఈ చర్యల కారణంగా ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. కొనుగోలు శక్తి తగ్గుతోంది.

తెలంగాణ బ్యూరో, మే 13 (తీన్మార్ న్యూస్): వస్తూత్పత్తి పెరుగుతున్నా మార్కెట్ లేకుండా పోతోంది. దీంతో వస్తువుల ధరలు పెరిగి సామాన్యులకు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి. అందువల్ల మన పన్నుల విధానాన్ని తక్షణం సమీక్షించాల్సి ఉంది. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి తగ్గట్లుగా విధానాలు ఉండాలి. నిజానికి యుద్ధాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. తరవాత ఇజ్రాయిల్ యుద్ధం కూడా ఇదే పరిస్థితిలోకి నెట్టింది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాల

మిగతా 2 లో






## రాష్ట్రంలో రాగల ఐదు రోజులపాటు వర్షాలు

### హెచ్చరించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురుస్తాయని అంచనా వేసింది.

హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): ములుగు, కొత్తగూడెం, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే

మిగతా 2 లో



## నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా దేశంలో సునామీ రాబోతున్నది

### ప్రజలు మార్పు కోరుకుంటున్నారు : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా ఈ దేశంలో సునామీ రాబోతున్నదని ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీసి పెట్టుబడులు గుజరాత్ కు తరలించుకుపోవాలని, యూపీ పరిస్థితిని తెలంగాణలో తీసుకురావాలని చూస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. సోమవారం కొడంగల్ లో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దేశంలో అధికారంలోకి వచ్చేది ఇండియా కూటమి ప్రభుత్వమేనని, ఎన్డీయే పత్తాలేకుండా పోతుందన్నారు.

తెలంగాణ బ్యూరో, మే 13 (తీన్మార్ న్యూస్): సౌత్ ఇండియాలో బీజేపీకి 15-20 సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికలు మాకు రెఫరెండం అని ఇండియా అలయన్స్ విజయం సాధించబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. రైతు బంధు ఎలా ఇచ్చామో, పంద్రాగస్టులోగా రైతు రు-ణమాఫీ చేసి తీరుతామని రుణమాఫీ ఏమీ అసాధ్యమైన టాస్క్ కాదన్నారు. కేసీఆర్ కేఏ పాల్ మాదిరిగా మాట్లాడుతున్నారని మానసిక ఒత్తిడితో, నిరాశతో భావోద్వేగంతో ఆయన ప్రకటనలు

మిగతా 2 లో

## ఓట్లను బహిష్కరించిన అమరగిరి చెంచుగూడెం

### కరెంట్ కోతతో గ్రామస్థుల నిరసన

### కరెంట్ వస్తేగాని ఓట్లు వేయమంటూ ఆగ్రహం వ్యక్తం

నాగర్‌కర్నూల్, మే 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఒక్క నిమిషం కూడా కరెంటు కోతలు లేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు వట్టి కోతలేనని మరోసారి రుజువైంది. ఏకంగా సీఎం సొంత జిల్లాలోని ఓ తండా మూడు రోజులుగా విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. కరెంటు వచ్చేవరకు ఓటేసేది లేదని ఆందోళనకు దిగారు. దీంతో ఓటర్లు లేకపోవడంతో ఆ ఊర్లోని పోలింగ్ కేంద్రంలో అధికారులు ఖాళీగా ఉ ండిపోయారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి చెంచు గూడెంలో మూడు రోజులుగా కరెంటు లేకపోవడంతో గ్రామస్థులు ఓట్లు వేయకుండా ఆందోళనకు దిగారు. గత మూడు రోజుల నుంచి కరెంట్ లేకపోవడంతో నానా ఇబ్బందులు

మిగతా 2 లో





## హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాధవీలతపై పోలీసులకు ఫిర్యాదు

### మొహం పరిశీలించినందుకు జిల్లా ఎన్నికల అధికారి పోలీసులకు ఆదేశాలు

ముస్లింల మనోభావాలు దెబ్బతీయడంతో పాటు అనుచితంగా ప్రవర్తించారంటూ హైదరాబాద్ లోక్‌సభ స్థానం బీజేపీ అభ్యర్థి మాధవీలతపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో మలక్ పేట పోలీసులు మాధవీలతపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని ఓ పోలింగ్ స్టేషన్ లో ముస్లిం మహిళల నకాబ్ తొలగించి మొహం పరిశీలించినందుకు మాధవీలతపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్, మే 13 (తీన్మార్ న్యూస్): దీంతో ఐపీసీ సెక్షన్‌లోని 171 సీ, 186, 505 (1) తో పాటు ప్రజా ప్రతినిధుల చట్టంలోని సెక్షన్ 132 కింద మాధవీ లతపై కేసులు పెట్టారు. అంతకుముందు హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత మల్కాజిగిరిలో తన ఓటు హక్కును

మిగతా 2 లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

### రాజకీయ వ్యాఖ్యలు చేశారంటూ రఘునందన్ ఆరోపణలు



తెలంగాణ బ్యూరో, మే 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీకి ఎన్నికల సంఘం ఫిర్యాదు చేసింది. ఓటు వేసిన తర్వాత ప్రెస్ మీట్ పెట్టి రాజకీయ వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనల కింద చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఈసీకి రఘునందన్ ఫిర్యాదు చేశారు. కొడంగల్‌లో సీఎం ప్రెస్‌మీట్ పెట్టి మోదీ, బీజేపీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. రేవంత్‌పై చర్యలు తీసుకోవాలంటూ రఘునందన్ కోరారు. కాగా ఓటు వేసేందుకు కుటుంబసభ్యులతో

మిగతా 2 లో

## పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి పరాభవం తప్పదు

### జోష్యం చెప్తున్న బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్




సిద్దిపేట, మే 13 (తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి పరాభవం తప్పదంటూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జోష్యం చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని మాజీ సీఎం కేసీఆర్ స్వగ్రామం చింతమడకలో ఓటు హక్కు

మిగతా 2 లో

## ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. జైలు నుంచి బయటకు వస్తా

### ఆప్ కౌన్సిలర్లతో జరిగిన సమావేశంలో కేజ్రీవాల్ వాఖ్యలు

న్యూ ఢిల్లీ, మే 13 (తీన్మార్ న్యూస్)::విపక్ష ఇండియా కూటమి అధికారంలోకి వస్తే తాను తిహాడ్ జైలు నుంచి బయటకు వస్తానని దీల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న విషయం తెలిసిందే. ఇండియా కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే మెజారిటీ వస్తే జూన్ 5నే తాను జైలు నుంచి విడుదలవుతానని

మిగతా 2 లో



## స్వగ్రామంలో ఓటు వేసిన మంత్రి సీతక్క

### కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందంటూ వాఖ్యలు

ములుగు, మే 13 (తీన్మార్ న్యూస్): సోమవారం మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంత్రి సీతక్క తన స్వగ్రామం ములుగు మండలం లోని జగ్గన్నపేట గ్రామంలో ఓటు వేసి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో



## కాంగ్రెస్ ఎప్పుడూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదు

### బదులుగా ఓట్లను కాపాడుకోవడానికి బుజ్జగింపులపై దృష్టి

### కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డ ప్రధాని నరేంద్ర మోడీ

న్యూ ఢిల్లీ, మే 13 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ఎప్పుడూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదని, బదులుగా ఓట్లను కాపాడుకోవడానికి బుజ్జగింపుపై దృష్టి పెట్టిందని ప్రధాని మరియు సీనియర్ బిజెపి నాయకుడు నరేంద్ర మోడీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. గతంలో

మిగతా 2 లో



# పన్నుల భారంతో ఆర్థికమాంద్యం

**మొదటి పేజీ తరువాయి**

కారణంగా ధరల దాడి తప్పడం లేదు. ప్రధానంగా ఆయిల్, నూనెల ధరలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పెట్రో,గ్యాస్ ధరలు మున్ముందు మరింతగా పెరిగే అవకాశాలు లేవని చెప్పలేం. మంచినూనెల సరఫరా కూడా దెబ్బ తినే అవకాశం ఉన్నందున ఇప్పటికే పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, సోయా నూనె, వనస్పతి ధరలు కూడా పెరగడం మొదలెట్టాయి. మనదేశ చమురు ఉత్పత్తుల వినియోగంలో 85 శాతం దిగుమతులపై ఆధారపడి జరుగుతుంది. కరోనా వలన, ఇతర కారణాల వలన చమురు ఉత్పత్తుల వినియోగం తగ్గింది. కాని పెరిగిన ధరల వలన వాటికి వెచ్చించే మొత్తం మాత్రం పెరిగింది. ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించలేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మీద పెరగలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించి వేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగు తోంది. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరు తోంది.




ఆవిధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్విడానికో, వారి బకాయిలను మాఫీ చేయడానికో కేంద్రంలోని ప్రభుత్వం వినియోగిస్తోంది. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో 45.5 శాతం, డీజిల్ ధరలో 39.8 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదానిలో కేంద్రం రాష్ట్రాలతో భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూవుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. టోకు ధరల సూచి జనవరి 2021తో పోల్చితే జనవరి 2022 నాటికి 13 శాతాన్ని దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు వ ఖందు అంచనా వేసినట్టు 9.2 శాతం కాకుండా 8.9 శాతమే ఉండబోతుందని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఒమిక్రాన్, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజా ఉదాహరణాలు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారులమీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీని పర్యవసానంగా శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. దానివలన సరుకుల వినియోగం తగ్గిపోతుంది. మార్కెట్ లోని సరుకులు చెల్లుబాటు కావు. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రజల కొనుగోలుశక్తిని పెంచే మార్గాలు అన్వేషించాలి. ఉపాధికల్పన మార్గాలను అన్వేషించాలి. కనీసం పెట్రో ఉత్పత్తుల మీద పన్నులను పెంచడం తగ్గిస్తే ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతుంది. కేంద్ర రాష్ట్రాలు విధిస్తున్న సెస్సులను తగ్గిస్తే అనేక సమస్యలకు సమాధానం లభిస్తుంది. కేంద్రం తీసుకుంటున్న నిరణయాలు ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలే తప్ప దెబ్బతీయరాదు. జిఎస్టీని సమీక్షించకుండా, పెట్రోల్ ధరలపై వ్యాట్ సమీక్షించకుండా ఎంతకాలం సాగించినా దేశం ఆర్థికశక్తిగా ఎదగదని గుర్తించాలి.

# రాష్ట్రంలో రాగల ఐదు రోజులపాటు వర్షాలు

**మొదటి పేజీ తరువాయి**

అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. గురు, శుక్రవారాల్లోనూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే పలు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా హన్మకొండ జిల్లా శాయంపేట, ఆత్మకూరు 12 సెంటీమీటర్లకుపైగా వర్షాపాతం నమోదైందని వాతావరణ శాఖ వివరించింది.

# హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాధవీలతపై పోలీసులకు ఫిర్యాదు

**మొదటి పేజీ తరువాయి**

వినియోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ స్టేషన్లను మాధవీలత సందర్శించారు. ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎంఐఎం దొంగ ఓట్లు వేయిస్తుందని గతంలో మాధవీలత ఆరోపించారు. ఈనేపథ్యంలో ఆమె పలు పోలింగ్ కేంద్రాల వద్ద పలువురు ముస్లిం మహిళా ఓటర్లను నిశితంగా పరిశీలించారు. వారి బురఖా నకాబ్‌లను తొలగించి మొహం చూసేందుకు ప్రయత్నించారు. ఓటర్ల ఆధార్ కార్డులను మాధవీలత క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆధార్ కార్డుల్లోని ఫోటోలు, ముస్లిం మహిళల ముఖాలు సరిపోలడం లేదని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ హైదరాబాద్‌లో పోలింగ్ విషయంలో అప్రమత్తత అవసరం. నియోజకవర్గంలో కొందరిని ఓటు వేయకుండా చేస్తున్నారు. పోలీసులు చురుగ్గా లేరు. ఎవ్వరినీ విచారించడం లేదు. సీనియర్ సిటిజన్ ఓటర్లు ఇక్కడికి వస్తున్నప్పటికీ వారి పేర్లను జాబితా నుంచి తొలగించారు. చనిపోయినవారి పేర్లతోనూ ఓట్లు వేస్తున్నారు. అజంపుర, గోషామహల్‌లో అక్రమాలపై ఈసీకి కంప్లైంట్ చేస్తాం" అని మాధవీలత తెలిపారు. ముస్లిం మహిళల నకాబ్‌లను మాధవీలత తీయిస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మాధవీలత తీరుపై ఎంఐఎం కార్యకర్తలు మండిపడుతున్నారు. ఆమె పోలింగ్ బూతును తనిఖీ చేస్తున్నట్లు లేదని ఓటర్లను బెదిరిస్తున్నట్లు ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం మహిళల బురఖాలు తీసే అధికారం మాధవీలతకు ఎవరిచ్చారని మజ్లిస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఈవివరాలతో కూడిన ఒక వీడియోను ఎంఐఎం అధినేత, హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ రిట్వీట్ చేశారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి కూడా స్పందించారు. నేను ఇంకా ఆ వీడియో చూడలేదు. బీజేపీ కేవలం ముస్లిం ఓట్లను పోలరైజ్ చేయడానికి ప్రయత్నిస్తోంది. ఇలా చేయడం వల్ల అసదుద్దీన్ ఒవైసీకి సాయం చేసినట్లు అవుతుంది. దాని వల్ల బీజేపీకి ఎలాంటి ప్రయోజనం ఉండదు అని రేవంత్ వ్యాఖ్యానించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

**మొదటి పేజీ తరువాయి**

కొడంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పరిషత్ స్కూలులోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేసిన అనంతరం స్థానికులతో మాట్లాడారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ఇదిలాఉంటే కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై కాంగ్రెస్ సైతం ఫిర్యాదు చేసింది. ఓటు వేసి మీడియాతో మాట్లాడుతూ మోడీ పేరును ప్రస్తావించినందుకు కేసు నమోదు చేయాలంటూ సీఈఓ వికాస్ రాజ్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది.. ఆ తర్వాత బీజేపీ రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులపై ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది.

# పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి పరాభవం తప్పదు

**మొదటి పేజీ తరువాయి**

వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ మోదీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పరాభవం తప్పదన్నారు. రాష్ట్రంలో 65 శాతం నుంచి 70 శాతం పోలింగ్ జరిగే అవకాశం ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రాంతీయ పార్టీలే కీలక పాత్ర పోషిస్తాయన్నారు. బీజేపీ నిబంధనల ప్రకారం 75 సంవత్సరాల వయసు తర్వాత ఏ నాయకుడు ఏ పదవి చెప్పట్టరని ప్రధాని మోదీ కూడా తప్పుకోవాల్సిందే అన్నారు. ఇండియా కూటమిలో మీరు చేరుతారా అన్న ప్రశ్న కు స్పందిస్తూ రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలే కీలకంగా మారుతాయని అందులో సందేశం లేదని పేర్కొన్నారు.

## ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. జైలు నుంచి బయటకు వస్తా

**మొదటి పేజీ తరువాయి**

ఆప్ కౌన్సిలర్లతో సోమవారం జరిగిన సమావేశంలో కేజ్రీవాల్ అన్నారు. దిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్ అరెస్టయిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం జూన్ 1 వరకు సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తిరిగి జూన్ 2న జైల్లో లొంగిపోవాల్సి ఉంది. జూన్ 1న సార్వత్రిక ఎన్నికల ఏడు దశల పోలింగ్ ముగియనుండగా.. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

తిహాడ్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సమయంలో తనను అవమానించేందుకు ప్రయత్నించారని కేజ్రీవాల్ ఆరోపించారు. తన సెల్‌లో ఉన్న రెండు సీసీటీవీ కెమెరాలను 13 మంది అధికారులు నిరంతరం పర్యవేక్షించేవారని పేర్కొన్నారు. ఆ ఫుటేజీని ప్రధానమంత్రి కార్యాలయానికి కూడా పంపినట్లు ఆరోపించారు. తనపై మోదీకి అంత అక్కసెందుకో అర్థం కావడం లేదన్నారు. ఆప్ నేతలను ప్రజలు ఎంతో గౌరవంతో, ప్రేమతో చూస్తున్నారని కేజ్రీవాల్ అన్నారు. భాజపా మాత్రం భయపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆదివారం పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమైన విషయం తెలిసిందే. తాను జైల్లో ఉన్నప్పుడు ఆప్ ఎమ్మెల్యేల్లో విభజనకు భాజపా విఫలయత్నం చేసిందన్నారు. కానీ, అందరూ ఐక్యంగా ఉండి వారి ఎత్తుగడలను తిప్పికొట్టారన్నారు. దీంతో పార్టీ మరింత బలం పుంజుకుందని పేర్కొన్నారు.

# స్వగ్రామంలో ఓటు వేసిన మంత్రి సీతక్క

**మొదటి పేజీ తరువాయి**

సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిరిగానే దేశంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు అని, కులాల మధ్య, మతాల మధ్య, చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలని చూసే పార్టీలకు ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. దేశంలో ఇప్పుడున్న ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని అంటున్నారని అన్నారు. ప్రజలు గమనించాలి దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుంది, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుంది అని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల గ్రామ నాయకులు కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

# ఓట్లను బహిష్కరించిన అమరగిరి చెంచు గూడెం ప్రజానికం




**మొదటి పేజీ తరువాయి**

పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము చెంచులమన్న ఉద్దేశంతోనే ఎవరూ ఇటువైకూడా రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం, మంచినీటి వసతి, రేషన్ కార్డులు లాంటి సమస్యలు ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నల్లమల ప్రాంతం కావడంతో పాములు వస్తున్నాయని, కరెంట్ లేకపోవడంతో పాము కాటుకు గురి కావాల్సివస్తుందని తెలిపారు. విద్యుత్ అధికారులు కరెంటు బిల్లులు అడుగుతారు కాని, కరెంటు మాత్రం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, గ్రామస్థులు ఓట్లను బహిష్కరించడంతో పోలింగ్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో విద్యుత్ సిబ్బంది హుటాహుటిన చెంచు గూడెంకు చేరుకున్నారు.




## పోలింగ్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులకు ఘర్షణ

*పరకాల పోలీస్ స్టేషన్ ముందు బీఆర్ఎస్ నేతల ఆందోళన*

*దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్*




పరకాల, మే 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. కాగా పోలింగ్ రాష్ట్రమంతటా ప్రశాంతంగా జరగ్గా, కొన్నిచోట్ల మాత్రం చెదురుమదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ తలెత్తింది. వివరాల్లోకి వెళ్తే వరంగల్ జిల్లా పరకాల మండలం నాగారంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. పోలింగ్ సెంటర్ దగ్గర బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను చెదరగొట్టారు. బీఆర్ఎస్ నాయకులు రత్నాకర్ రెడ్డి, నాగయ్య, గుండె వేణులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతల దాడిని నిరసిస్తూ పరకాల పోలీస్ స్టేషన్ ముందు బీఆర్ఎస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో పరకాల-హుజురాబాద్ ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అయింది. మరోవైపు బీఆర్ఎస్ నేతలకు సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు పోలీసులు.

## ముగిసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నామినేషన్ ఉపసంహరణ గడువు

**ఈనెల 27న జరుగనున్న పోలింగ్**

తెలంగాణ బ్యూరో, మే 13 (తీన్మార్ న్యూస్): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నామినేషన్ ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. మే 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా ఈ 13వ తేదీ (సోమవారం) వరకు నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు గడువు విధించారు. తాజాగా గడువు ముగియడంతో అభ్యర్థులు పోలింగ్‌పై దృష్టి పెట్టారు. ఈనెల 27న పోలింగ్ జరుగనుంది. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. వచ్చే నెల 5వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉండనుంది. అయితే, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్ల రాజేశ్వర్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి జనగామా ఎమ్మెల్యేగా గెలుపొందిన




విషయం తెలిసిందే. దీంతో ఆయన ఎమ్మెల్సీకి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, ఈ నియోజకవర్గంలో 4,61,806 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా దేశంలో సునామీ రాబోతున్నది

**మొదటి పేజీ తరువాయి**

చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పై నాకు సానుభూతి ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 39.5 శాతం ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో అంతకు మించి వస్తాయని చెప్పారు. 2025తో మోదీ 75 ఏళ్లు నిండుతాయని ఏజ్ లిమిట్ అమలు చేస్తే బీజేపీలో ప్రధాని ఎవరో బీజేపీ తేల్చుకోవాలని అన్నారు.

**కౌన్ నామ్ దార్ కౌన్ కామ్ దార్?**

నరేంద్ర మోడీ దేశ ప్రజలను మాయ మాటలు చెబుతూ మోసం చేస్తున్నారని రాహుల్ గాంధీ డిబెట్ కు పిలిస్తే తాము నామ్ దార్ కాదు కామ్ దార్ అని మోడీ చేసిన వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఇండియా కూటమి పేరుతో మేం ప్రజలను ఓట్లు అడుగుతుంటే మోడీ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోంది. ఇందులో ఎవరు నామ్ దార్.. ఎవరు కామ్ దార్ అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీని పప్పు అని హేళన చేశారు. కానీ అదే పప్పుతో డిబెట్ కు రమ్మంటే పారిపోతున్నారని విమర్శించారు. ఎవరు అట్టడుగు వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నారో చర్చకు సిద్ధమన్నారు. దేశంలో మోడీ వ్యతిరేక వేవ్ నడుస్తోందని రాబోయేతి సునామీయే అన్నారు. మ్యాజిక్ ఫిగర్ రాకపోతే బీజేపీ, ఎన్డీఏకు దేశంలో మద్దతు ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరన్నారు. 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తున్న బీజేపీ 400 సీట్లు ఎట్లా సాధ్యమని ప్రశ్నించారు. 13 ఏళ్లు సీఎంగా, 10ఏళ్లు పీఎంగా పని చేసిన మోదీ మన రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదన్నారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవని సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే దేశంలో రిజర్వేషన్లు అమలులో ఉన్నాయన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఒక వీడియో వైరల్ కేసులో మాపై రంగంలోకి దిగిన ఎంహెచ్ఏ మోదీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడినా, నవనీత్ కౌర్ 15సెకన్ల కామెంట్స్ చేసినా బీజేపీ నేతలపై ఎంహెచ్ఏ కంప్లైంట్ చేయదని దుయ్యబట్టారు. ఏజెన్సీలను బీజేపీ దుర్వినియోగం చేస్తుందనడానికి ఇది నిదర్శనం అని బీజేపీ వాషింగ్ మెషిన్ లో చేరగానే కొందరు నాయకుల అవినీతి మరకలు తొలగిపోయాయా.. అని నిలదీశారు. కాంగ్రెస్ కు ఆదానీ, అంబానీ డబ్బులు ఇస్తున్నారన్న మోడీని ఒక్కటే అడుగుతున్నా ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను పంపి ఆదానీ, అంబానీల ఆఫీసులపై, ఇళ్లల్లో సోదాలు నిర్వహించండి. మోదీ ఆరోపణలు నిజమైతే ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ, ఎన్ఐఏను అడ్డుగా పెట్టుకుని బీజేపీ లబ్ధి పొందాలని చూస్తోందని ఇప్పుడు ఢిల్లీ పోలీసుల ద్వారా భయపెట్టాలని చూస్తోందన్నారు.

## రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగాయి

**మొదటి పేజీ తరువాయి**

అత్యధికంగా మెదక్‌లో 71.33 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా హైదరాబాద్‌లో 39.17 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు. కేంద్ర ఆధ్వర్యంలో ఉండే యాప్‌లలో 415 ఫిర్యాదులు రాగా వేర్వేరు ప్రాంతాల్లో 38 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. 225 ఫిర్యాదులు సీ విజిల్ యాప్ ద్వారా వచ్చాయన్నారు. భారీ బందోబస్తుతో స్ట్రాంగ్‌రూమ్స్‌లో ఈవీఎంలను భద్రపరుస్తామన్నారు. ఈవీఎంలలో సమస్య వస్తే వెంటనే రీప్లేస్ చేశామని.. సాయంత్రం ఐదు గంటలకు వచ్చిన పోలింగ్ శాతం అంచనానే అంటూ సీఈవో వికాస్ రాజ్ తెలిపారు. రాత్రి 7 గంటల తర్వాత కచ్చితమైన పోలింగ్ శాతం వస్తుందని.. రేపు పూర్తి పోలింగ్ శాతం వస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు 330 కోట్లు సీజ్ చేశామన్నారు. 44 కౌంటింగ్ కేంద్రాలు ఉన్నాయని జనరల్ అబ్జర్వర్స్ ఇచ్చే నివేదిక మేరకు ఎక్కడైనా రీపోలింగ్ అవసరమా లేదా నిర్ణయిస్తామన్నారు.

## కాంగ్రెస్ ఎప్పుడూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదు

**మొదటి పేజీ తరువాయి**

బిఎమ్ఎమ్ఆర్‌యు రాష్ట్రాలుగా పిలువబడిన రాష్ట్రాలు అభివృద్ధి చెందడానికి బిజెపి అభివృద్ధి ఆధారిత పాలన ఫలితమేనని మోడీ అన్నారు. ఒక వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, బిజెపి ప్రభుత్వాలు లక్షలాది మందికి లబ్ధి చేకూర్చే పథకాలను తీసుకువచ్చాయని, పేదలకు ఇళ్లు, యువతకు అవకాశాలు మరియు మహిళలకు సాధికారత కల్పించాయని మోడీ పేర్కొన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో భారత కూటమి బుజ్జగింపు-ఆధారిత విధానాన్ని కూడా శ్రీ మోదీ విమర్శించారు మరియు వారు అర్హులైన వారి నుండి రిజర్వేషన్లను తీసివేసి, ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన వ్యక్తులకు ఇస్తామని ఆరోపించారు. ఒక ప్రైవేట్ టీవీ ఛానెల్‌కి ఇచ్చిన విభిన్న ఇంటర్వ్యూలో, ఉత్తర-దక్షిణ కథనాన్ని నెట్టడానికి విపక్షాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఆరోపిస్తూ, తనకు మరియు అతని పార్టీకి దేశం నలుమూలల నుండి మద్దతు లభిస్తోందని ఆరోపిస్తూ మిస్టర్ మోడీ విపక్షాలపై దాడి చేశారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## చార్ సౌ... సాధ్యమేనా

లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారి గెలిచి సత్తా చాటాలని భారతీయ జనతా పార్టీ ఆరాటపడుతోంది. 2024 ఎన్నికల్లో 400 సీట్లు గెలిచేందుకు బీజేపీ ఇప్పటికే రూట్‌మ్యాప్‌ను ప్రకటించింది. కొత్త పొత్తులు, విపక్ష నేతలను పార్టీలను చేర్చుకోవటంతో బాటు 2019లో ఓడిన స్థానాల మీద ప్రత్యేక దృష్టి పెట్టింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ బరిలో నిలిచే సీట్లు 450. మోదీ చెబుతున్నట్లు బీజేపీ 370 గెలవాలంటే పోటీచేసే మొత్తం సీట్లలో ఏకంగా 82 శాతం సీట్లు గెలవాల్సి ఉంది. ఇప్పటి వరకు బీజేపీ చరిత్రలో ఆ పార్టీ 2019లో 70 శాతం సీట్లలో గెలిచింది. ఆ ఎన్నికల్లో 436 సీట్లకు పోటీ చేసి 303 సీట్లను బీజేపీ గెలుచుకోగలిగింది. పై సమీకరణాల నేపథ్యంలో బీజేపీ, దాని మిత్ర పక్షాలు కనీసం గతంలో గెలుచుకున్న సీట్లలో 60 నుంచి 70 సీట్లు కోల్పోయే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలోనే బీజేపీ రెండు మెట్లు దిగి ఏపీ, ఒడిసా వంటి రాష్ట్రాల్లో పొత్తుకు సిద్ధపడింది. 2019 ఎన్నికల్లో గెలుచుకున్న303కు అదనంగా మరో 97 స్థానాలు గెలిచి, 1984లో ఇందిరాగాంధీ మరణం తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 49% ఓట్లు, 404 సీట్ల రికార్డును తిరగరాయాలని పనిచేస్తోంది. దీనికోసం 'అబ్ కీ బార్.. చార్ సౌ కీ పార్' అనే ఆకర్షణీయమైన నినాదాన్ని ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. ప్రపంచపు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశపు కీలక రాజకీయ పక్షంగా బీజేపీ ఆకాంక్ష మెచ్చుకోదగినదే అయినా క్షేత్రస్థాయి వాతావరణం మాత్రం అదంత సులభం కాదనే సందేశాలు పంపుతోంది. బీజేపీకి ఆయువుపట్టుగా ఉన్న రాష్ట్రాలో ఉత్తరప్రదేశ్ మొదటిది. ఇక్కడి 80 లోక్‌సభ సీట్లలో 2019లో ఆ పార్టీ 62 సీట్లు గెలిచింది. నాడు ఆ మిగిలిన స్థానాల్లో బీఎస్పీ 10, ఎస్పీ 5, ఇతరులు 3 స్థానాలు గెలుచుకున్నాయి. అయితే, 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 41.29 శాతం ఓట్లకే పరిమితమైంది. యూపీలో మోదీ, యోగి చరిష్మా, అయోధ్య అంశాలు బీజేపీకి కలిసొచ్చే మాట నిజమే అయినా, ఈసారి అక్కడ సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీపార్టీ పొత్తుకు సిద్ధమయ్యాయి. మొత్తం 80 సీట్లలో 62 స్థానాల్లో ఎస్పీ, 17 సీట్లలో కాంగ్రెస్, 1 స్థానంలో ఆప్ పార్టీలు పోటీ చేయనున్నాయి. ఇక్కడ మాయావతి ఒంటరిగా పోటీచేయటం వల్ల 2019లో బీజేపీ సాధించిన 62 సీట్లలో కనీసం 15 సీట్లలో కోత పడే ప్రమాదం ఉంది. ఇక బీహార్ విషయానికి వస్తే.. అక్కడున్న మొత్తం 40 సీట్లలో 2019లో బీజేపీ 17, దాని నాటి మిత్రపక్షం జేడీయూ 16, లోక్‌జనశక్తి పార్టీ 6 సీట్లు సాధించాయి. అయితే, ఆ తర్వాత నితీష్ కుమార్ లాలూయాదవ్ ఆర్జేడీతో చేతులు కలిపి అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి సీఎంగా బాధ్యతలు చేపట్టి, తాజాగా తిరిగి ఎన్డీయేలో చేరారు. ఈ గోడదూకుడు వ్యవహారం నితీష్‌తో బాటు బీజేపీకి కూడా చెడ్డపేరు తీసుకొచ్చింది. దీనికి తోడు కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలతో పొత్తు పెట్టుకోవటంతో అక్కడ ఈసారి ఎన్డీయే సీట్లు సగానికి కోతపడనున్నాయని సర్వేలు చెబుతున్నాయి. ఆ పక్కనే ఉన్న జార్ఖండ్‌లో 14 సీట్లు ఉండగా, 2019లో బీజేపీకి 11, దాని మిత్రపక్షమైన ఏజేఎస్‌యు ఒక స్థానంలో గెలిచింది. 2024లో కాంగ్రెస్ 7, జేఎంఎం 5, వామపక్షాలు 2 స్థానాల్లో ఇక్కడ బరిలో దిగనున్నాయి. హేమంత్ సోరెన్ రాజీనామా తర్వాతి పరిణామాలు ఇక్కడ కాంగ్రెస్- జేఎంఎం కూటమి వల్ల బీజేపీ ఆరు సీట్లకి మించి గెలవటం కష్టమనే అభిప్రాయం ఉంది. మహారాష్ట్రలోని 48 సీట్లలో 2019లో బీజేపీ 23, శివసేన 18 స్థానాలు గెలవగా, కాంగ్రెస్, ఎంఐఎం చెరొకస్థానం, ఎన్సీపీ 4 సీట్లు గెలిచింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల తర్వాత శివసేన.. కాంగ్రెస్, ఎన్సీపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయటం, అది శివసేన చీలికతో ప్రభుత్వం పడిపోవటం జరిగింది. ఈసారి శివసేన (ఉద్ధవ్) 19, కాంగ్రెస్16, శరద్పవార్‌ఎన్సీపీ 9 స్థానాల్లో పొత్తుమీద పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ కూటమి అవకాశాలు గతంలో కంటే మెరుగుపడ్డాయని సమాచారం. ఇక ఒడిసాలో 21 సీట్లుండగా బీజేపీ-బీజేడీ పొత్తు కుదుర్చుకున్నాయి. ఇక్కడ బీజేపీ 8, బీజేడీ 13 సీట్లలో పోటీచేస్తున్నాయి కనుక ఇది బీజేపీకి విన్ విన్ డీల్ లాంటిది. ఇక పశ్చిమబెంగాల్‌లోని 42 సీట్లలో 2019లో బీజేపీ 18 సీట్లు గెలిచింది. ఈసారి మమత ఒంటరి పోరుకు సిద్ధం కావటంతో కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి బరిలో దిగనుంది. ఇక్కడ బీజేపీ బలం గతంలో కంటే తగ్గే అవకాశం ఉండటం ఇండియా కూటమికి కలిసొచ్చే అంశం కావచ్చు. ఇటీవలి మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ అధికారంలోకి వచ్చిన మాట నిజమే అయినా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఓట్ల శాతం తక్కువే. ఈ మూడు రాష్ట్రాల్లోని 65 సీట్లలో 2019లో బీజేపీ 61 స్థానాల్లో గెలిచింది. 2024 ఎన్నికల్లో బీజేపీ ఈ మూడు రాష్ట్రాల్లో 40 సీట్లకు మించి సాధించే అవకాశం లేదని సర్వేలు చెబుతున్నాయి. ఇక.. గుజరాత్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలోని 52 లోక్‌సభ సీట్లుండగా, 2019లో వీటిన్నింటిలోనూ బీజేపీయే గెలిచింది. కానీ, ప్రస్తుతం హిమాచల్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, ఢిల్లీ, గుజరాత్‌లో కాంగ్రెస్- ఆప్‌తో పొత్తు, హర్యానాలో వీస్తున్న కాంగ్రెస్ సానుకూల పవనాల వల్ల ఈ 5 రాష్ట్రాల్లో బీజేపీ గతంలో కంటే 12 సీట్లు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ఇక దక్షిణాదిన గల తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలో మొత్తం 128 సీట్లుండగా, 2019లో బీజేపీ కర్ణాటకలో 25, తెలంగాణలో 4 సీట్లు గెలిచింది. ఈసారి కర్ణాటకలో కాంగ్రెస్ హవా కారణంగా పది స్థానాలకు, తెలంగాణలో 4 సీట్లకే పరిమితం కానుందని సర్వేలు చెబుతున్నాయి. అయితే.. ఏపీలో జనసేన- టీడీపీ పొత్తులో 6 సీట్లు పొందినా అందులో గెలిచేది సగమే. ఈ క్రమంలో మొత్తంగా చూసినప్పుడు దక్షిణాదిలో బీజేపీ సొంతగా గెలిచే సీట్లు 18 లోపే ఉండవచ్చు. తమిళనాడు, కేరళలో అది సీట్లు పొందే పరిస్థితి లేదు. మరోవైపు పంజాబ్‌లోని 13, జమ్మూ కాశ్మీర్‌లోని 6, గోవాలోని 2 .. మొత్తం 21 సీట్లలో 2019లో బీజేపీ 6, కాంగ్రెస్ 9, అకాలీదళ్ 2, నేషనల్ కాన్ఫరెన్స్ 3, ఆప్ ఒక సీటు గెలుచుకున్నాయి. ఈసారి ఇక్కడ బీజేపీకి ఒకటో రెండో పోవటం తప్ప లాభం వచ్చే అవకాశం కనిపించటం లేదు. ఈశాన్య భారతంలోని అస్సాంలో 14, మిగిలిన ఆరు రాష్ట్రాల్లోని 11 స్థానాల్లో 2019లో వీటిలో 15 సీట్లు బీజేపీ గెలవగా, 5 సీట్లు దాని మిత్రపక్షాలు గెలిచాయి. ఇక్కడ ఇంతకంటే బీజేపీ పొందటానికి ఇంకేమీ కనిపించటం లేదు. ఇతరులు తలా రెండు సీట్లు గెలుచుకున్నాయి. కనుక ఇక్కడ కూడా బీజేపీ అదనంగా పొందటా నికి ఏమీ లేదు. ఏది ఏమైనా మోదీ నినాదం ఏమేరకు నిజమవుతుందో చూడాలంటే దేశ ప్రజలు జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

# మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం







రాజాపేట, మే 13(తీన్మార్ న్యూస్): రాజపేట మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో సోమవారం పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండల ఎన్నికల అధికారి దామోదర్ పర్యవేక్షణలో రూట్ ఆఫీసర్లు మాధవి, సాయి చైతన్య, కరుణాకర్ రెడ్డి, పూర్ణచందర్రావు, మధుల పర్యవేక్షణలో పోలీసుల బందోబస్తు మధ్య ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటల నుండి ఓటర్లు తమ ఓటు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలిరాగా మధ్యాహ్నం ఎండ వేడిమి కారణంగా మందకోడిగా పోలింగ్ సాగింది. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు సొంత గ్రామమైన పారుపల్లిలో ఓటు వేయగా, ఎంపీ అభ్యర్థి పెంట రమేష్ రాజపేటలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రాజపేట మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎమ్మెల్యే ఎన్నికల హడావుడి పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సందర్భంగా కనిపించలేదు. రాజపేట పట్టణంలోని 100వ బూత్ లో 1115 ఓట్లు ఉండగా బూత్ లోని ఓటర్లు ఓటు వేసేందుకు బారులు తీరారు. దీంతో ఉదయం ఏడు గంటల నుండి రాత్రి వరకు ఆ బూత్ లో ఓటర్లు సమయం వెచ్చించాల్సి వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం మరణించడంతో లెక్కింపు కూడా కష్టమైంది. 100వ బూతులో ఓటర్ల సంఖ్యను తగ్గించాలని అందులోని ఓటర్లు కోరారు. ఆ బూతులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కూడా ఒకింత ఇబ్బంది పడ్డారు. బాలింతలు నూతనంగా ఓటు హక్కు వచ్చినవారు వృద్ధులు, యువకులు, రైతులు, మహిళలు, విద్యావంతులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద అంగన్వాడి టీచర్ల తో పోలింగ్ స్లిప్పుల పంపిణీ ఏర్పాటుతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసి పోలీసులు అమలు చేశారు.

# తొలి ఓటేశాం... గొప్ప అనుభూతిని పొందాం

పెబ్బేరు, మే 13(తీన్మార్ న్యూస్): తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న సందర్భం మరిచిపోని అనుభూతినిస్తుంది. ఎన్నికలు వచ్చినపుడు ఇంట్లో పెద్దలు ఓటేయడానికి వెళ్తుంటే నాకెప్పుడు ఓటు హక్కు వస్తుందా? నేనెప్పుడు ఓటు వేస్తానని ఎదురుచూసిన యువతీ యువకులు ఎందరో ఉంటారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆ సందర్భం రానే వచ్చింది. తొలిసారి ఓటరు జాబితాలో పేర వచ్చిన యువత హుషారుగా పోలింగ్ కేంద్రానికి తరలివచ్చారు. ఓటు వేసి చేతి వేలికి వేసిన సిరా చుక్కను చూసుకుంటూ, సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు.

తొలి ఓటు వేసినందుకు సంతోషంగా ఉంది...

– బి.పవన్ కుమార్ రెడ్డి

ఓటరు జాబితాలో నా పేరు చేర్చగానే ఎన్నికలు ఎప్పుడు వస్తాయా?






ఎప్పుడు ఓటు వేస్తానని ఎంతో ఎదురుచూశా. మధ్యాహ్నం పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నాను. ప్రజాస్వామ్యంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవిని ఎన్నుకునే ప్రక్రియలో భాగమైనందుకు మాటల్లో చెప్పలేనంత సంతోషం వేసింది.

ఇకపై ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తా....

– మందడి చందు

తొలిసారి పోలింగ్ కేంద్రంలోకి అడుగు పెట్టగానే ఎంతో సంతోషం వేసింది. కేంద్రంలో ఓటు వేసే ప్రక్రియ ఎలా ఉంటుందో అవగాహన వచ్చింది. ఈవీఎంపై బటన్ నొక్కి బీప్ శబ్దం రాగానే తెలియని అనుభూతి వచ్చింది. ఇకపై ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తా

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు




టేక్మాల్, మే 13(తీన్మార్ న్యూస్): మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. 37 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. టేక్మాల్ లో పోలింగ్ సరళి ని ఆందోల్ శాసనసభ్యులు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పర్యవేక్షించారు. ప్రజలు ఉత్సాహంగా ఓటు వేసి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టేక్మాల్ మండలం మొత్తం 28729 ఓట్లకు గాను 22217 ఓట్లు పోలయ్యాయి. 77.3% ఓటింగ్ శాతం పోలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

# టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ, మే 13: సీబీఎస్ఈ 10, 12 తరగతుల పరీక్ష ఫలితాలు విడుదల చేసింది. పదో తరగతిలో 93.6 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దీంట్లో అమ్మాయిలు 94.75 శాతం మంది పాసయ్యారు. టెన్త్ లో అమ్మాయిలే ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణులు అయ్యారు. అబ్బాయిల కన్నా2.04 శాతం మంది అమ్మాయిలు అధికంగా పాసయ్యారు. పదో తరగతి పరీక్షల్లో అమ్మాయిలు 94.75 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. సుమారు 47 వేల మంది విద్యార్థులు..95 శాతం కన్నా ఎక్కువగా మార్కులు సాధించారు. 2.12 లక్షల మంది 90 శాతం కన్నా ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. తిరువనంతపురంలో అత్యధికంగా 99.75 శాతం ఉత్తీర్ణత నమోదు అయింది. 10వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13 వరకు నిర్వహించారు. 12వ తరగతి పరీక్షల్లో 87.98 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండు పరీక్షల ఫలితాల్లో బాలికలే పై చేయి సాధించారు. తిరువనంతపురంలోనే 99.91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 12వ తరగతి పరీక్షలనుఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించారు. విద్యార్థుల్లో పోటీతత్వం లేకుండా చేసేందుకు మెరిట్ జాబితాను సీబీఎస్ఈ ప్రకటించడం లేదు. ఇ-ఎబఇతీవబబీశ్రీబిబ.నితిఇ.తిని లో విద్యార్థులు ఫలితాలను చూసుకోవచ్చు. వెబ్ సైట్ ఓపెన్ చేసి రూల్ నంబర్ తో పాటు పుట్టిన తేదీ వివరాలను ఎంపిక చేసి స్కోరు చూసుకోవచ్చు.

# పారుపల్లి లో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ మంత్రి మోత్కుపల్లి



రాజాపేట, మే 13(తీన్మార్ న్యూస్): భువనగిరి పార్లమెంటు ఎన్నికల సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రాజాపేట మండలం తన స్వగ్రామం పారుపల్లి గ్రామంలో మాజీ మంత్రివర్యులు మోత్కుపల్లి నరసింహులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు.

# ఓటు హక్కును వినియోగించుకోవడానికి భారలు తీరిన ఓటరులు



రెంజల్: రెంజల్ మండలంలో ఉదయం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కావడంలో మహిళలు అత్యధిక సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. మండలంలో 11 గ్రామ పంచాయతీల పరిధిలో 29358 మంది ఓటర్లు ఉండగా 15,292 మంది మహిళలు, 14వేల 065 మంది పురుషులు ఓటు హక్కు ను వేయాల్సి ఉండగా మధ్యాహ్నం ఒంటిగంట వరకు సుమారుగా 41 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వికలాంగులు తమ ఓటు హక్కును వినియోగించు కు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బలగాలతో కట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అడిషనల్ సీపీ నీలా గ్రామాన్ని సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ప్రస్తుతం ఓటింగ్ శాతం మందకొండిగా కొనసాగుతోంది. సాయంత్రం వరకు 60 నుంచి 65 శాతం వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉందని అదికార్లు ప్రకటించారు.

# ఓటర్ స్లిప్పులు అందక ఓటర్లు ఇబ్బందులు



నాగిరెడ్డిపేట్: నాగిరెడ్డిపేట మండలంలోని నాగిరెడ్డిపేట్ గోపాల్పేట్ గ్రామాలతో పాటు పలు గ్రామాలలో ఓటర్ స్లిప్పులు అందక ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత వారం రోజుల నుండి గ్రామపంచాయతీ సిబ్బంది ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు కొందరి పేర్లు తెలవక, కొన్ని చిరునామా తెలవక వాటిని ఓటర్లకు పంచ లేకపోయారు. తద్వారా ఓటు హక్కు ఉన్న ఓటర్ స్లిప్పులు రాకపోవడంతో ఓటర్లు ఆందోళన పడ్డారు. తమ ఆధార్ కార్డును, పాన్ కార్డును ఎలక్షన్ ఐడెంటి కార్డును, తీసుకుని పోలింగ్ కేంద్రానికి చేరుకొని అక్కడ ఉన్న హెల్ప్ డెస్క్ ను సంప్రదించి తమ యొక్క ఓటర్ ఐడిని తీసుకొని ఓటు వేయాల్సి వచ్చింది. ఓటర్ స్లిప్పులు పంపిణీ చేసే సమ్మతిత శాఖతోపాటు సిబ్బంది చాకచక్యంగా వ్యవహరిస్తే ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండేది కాదని ఓటర్లు కోరుతున్నారు.

# సంక్రాంతి రికార్డును బ్రేక్ చేసిన టీస్ ఆర్టీసీ..

హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికల వేళ సంక్రాంతి రికార్డును టీఎస్‌ఆర్టీసీ బ్రేక్ చేసింది.

సంక్రాంతి సీజన్‌తో పోలిస్తే 10 శాతానికి పైగా ప్రయాణికులు ఆర్టీసీని వినియోగించుకున్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 1.42 లక్షల మంది ప్రయాణించారని టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

# జిన్నా రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక చేయూత

పాలకవీడు, మే 13(తీన్మార్ న్యూస్):నిరుపేదలకు అండగా జిన్నారెడ్డి ఫౌండేషన్ ఎల్లపుడు ఉంటుందని ఆ సంస్థ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం తన స్వాగ్రామంలో గత నెలలో చెట్టుపై నుండి పడి ప్రమాదవ శాత్తు గాయపడిన గీతా కార్మికుడు అంతటి శంకరయ్య కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5000/- రూపాయలు సహాయం చేశారు. అదే గ్రామానికి చెందిన చిలుముల భద్రయ్య భార్య సోమమ్మ స్వర్గస్తులయితే విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించి దశదిశకర్మకు రూ.5000/- రూపాయలు సహాయం చేశారు. ఆనంతరం అయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికీ జిన్నారెడ్డి ఫౌండేషన్ ఎప్పుడు అండగా ఉంటుందని, ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు సింగమోహన్ రావు,భూపాల్ రెడ్డి, జిన్నారెడ్డి సైదిరెడ్డి, రవి, అభిమళ్ళ సైదులు, నెకరికంటి జాన్, బాబు, పులి వెంకన్న, కాకునూరి నాగయ్య,



సాయిలు జిన్నారెడ్డి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా జరిగిన పార్లమెంట్ ఎన్నికలు

పెబ్బేరు, మే 13(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలంలోని పలు గ్రామాలోని పోలింగ్ స్టేషన్లలో సోమవారం జరిగిన పోలింగ్ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసాయి సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం మండలంలో 75 శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా మొదటి రెండు గంటల్లో కేవలం 20 నుంచి 26 శాతం మాత్రమే ఓట్లు పోలింగ్ కాగా, ఆ తర్వాత 11గంటల నుంచి ఓటింగ్ వేగంగ పుంజుకుంది. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరరాయించడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. సాంకేతిక సమస్యలను పరిష్కరించడంతో ఓటర్లు ఓటు వేయగలిగారు. మండల ప్రజా ప్రతినిధులు మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, ఎంపీపీ ఆవుల శైలజ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బూత్‌లో తన ఓటు హక్కును



వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఈ జిల్లాల్లో వడగళ్ల వానలు.. హెచ్చరించిన వాతావరణ శాఖ

తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురుస్తాయని అంచనా వేసింది. ములుగు, కొత్తగూడెం, మెదక్, కామారెడ్డి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, సిద్ది పేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్



జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. గురు, శుక్రవారాల్లోనూ పలు జిల్లాల్లో వర్షాలు కురిసే పలు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా హన్మకొండ జిల్లా శాయంపేట, ఆత్మకూరు 12 సెంటీమీటర్లకుపైగా వర్షాపాతం నమోదైందని వాతావరణ శాఖ వివరించింది.

# అమ్మలను అనుబంధాల పేరిట బంధించేస్తున్నాం

**- డా.హిప్నో పద్మా కమలాకర్, యోగా గురు బి.సరోజని రామారావు, కృష్ణ వేణి**

సిటీబ్యూరో: అమ్మలను అనుబంధాల పేరిట బంధించే స్తున్నామని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్, యోగా గురు బి.సరోజని రామారావు అన్నారు. 12 మే మదర్స్ డే సందర్భంగా ఇందిరా పార్క్‌లో భారతీయ యోగ సంస్థానం ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చీకటిలో కూడా ఎలా బ్రతకాలో దారి చూపేది అమ్మేనన్నారు. పడినా మరలా పైకి లేపి యువ శక్తి ని తట్టి లేపేది అమ్మేనన్నారు. మొక్కవోని ధైర్యం తో ముందుకు దూసుకుపోమని పిల్లలకు చెపుతుందన్నారు. అమ్మ ఒక జర్నలిస్టు, న్యాయవాది, పనికత్తే, రాజకీయ వేత్త, విశ్లేషకురాలు కథకురాలు, ఆర్థిక వేత్త, ఇలా అన్నింటిలో తానై నడిపిస్తుందన్నారు. పిల్లల , భర్త గురించి, ఆ తరవాత ఉద్యోగం, అత్తమామలు, వీలయితే తల్లిదండ్రుల గురించి ఆలోచించాకే తన గురించి వారు ఆలోచిస్తారని చెప్పారు. ఒకవేళ కాసేపు సరదాగా బయలుకు వచ్చినా పిల్లల గురించో, ఇంటి గురించో ఆలోచిస్తూనే ఉంటారన్నారు. తనకు ఇది కావాలి అని స్పష్టంగా కోరుకున్న అమ్మను



విచిత్రంగానే చూస్తామన్నారు. అమ్మకు కావలసిన శారీరక, మానసిక విశ్రాంతి, చల్లని మాటలను అందించాలన్నారు. అందరికి సేవచేయలేకపోయామన్న న్యూన్యత నుండి వారికి కాస్త సాంత్వన, మంచి భోజనం, ఆరోగ్యంపై శ్రద్ధ, చూపాలని తెలిపారు. ఈకార్యక్రమంలో జి.కృష్ణవేణి, డా.గీత, శ్రీలత, జ్యోతి రాజా,యశోద, వాణిశ్రీ, హరిత,సుజాత, సుభాషిణి 30 మంది మహిళలు పాల్గొన్నారు. యోగా గురు బి.రామారావు ఆధ్వర్యంలో యోగా సాధకులు రాజేంద్ర కుమార్ , ప్రకాష్, రాజేంద్ర సింగ్, శేఖర్, సుధాకర్ యాదవ్ తదితరులు అమ్మలందరిని సన్మానించారు. ఇంత చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన యోగా గురు బి.సరోజని రామారావును ఘనంగా సత్కరించారు.

# 'ఎంఎల్ఆర్ఐటీ'లో రోబోటిక్స్‌పై జాతీయ స్థాయి కార్యక్రమం

సిటీబ్యూరో: రోబోటిక్స్ రంగంలో అత్యాధునిక పురోగతులు, ఆవిష్కరణలను ప్రదర్శించే జాతీయ స్థాయి రోబోటిక్ ఈవెంట్‌ను రోబోటిక్ క్లబ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం, దుండిగల్‌లోని ఎంఎల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమం మన దేశంలో రోబోటిక్స్ పరిశ్రమను నడిపిస్తున్న విశేషమైన ఆవిష్కరణ, సృజనాత్మకతను ప్రదర్శించింది. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విపత్తు ప్రతిస్పందన, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సవా ళ్లను పరిష్కరించడానికి రోబోటిక్స్ సాంకేతికతను ఉపయో గించుకోవడం, వాస్తవ-ప్రపంచ సమస్యలకు తెలివి గల పరిష్కారాలను పాల్గొనేవారు ప్రదర్శించారు. ఈ కార్యక్ర మంలో తమిళనాడు, పాండిచ్చేరి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 100 మంది పాల్గొని తమ రోబోటిక్ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ప్రధాన ఆకర్షణలు రోబో సాకర్, రోబో సుమో, లైన్-ఫాలోయింగ్ రోబోట్‌లను అనుసరించి థ్రిల్లింగ్ రోబో రేస్, చివరిది ఆకర్షణీయమైన డ్రోన్ రేస్. ఎంఎల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు తయారు చేసిన "చిట్టి" అనే దాని స్వదేశీ



ఏ1-ఆధారిత రోబోట్ ద్వారా ఉదాహరణగా చెప్పవచ్చు. చిట్టి తన ఆకర్షణ రెయమైన సంభాషణలతో ప్రేక్షకులను అలరిస్తూ, మనుషుల తరహా కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాల్గొన్న వారందరినీ ఆప్యా యంగా పలకరించింది. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ఐటీ వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను కనబరచేందుకు, సాంకేతికతలో సరికొత్త ట్రెండ్స్‌పై అనుభవాన్ని అందించేందుకు వీలుగా వినూత్న కార్యక్రమాల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహి స్తున్నామన్నారు.

# ఓటు వేస్తూ ఫొటో దిగిన యువకుడిపై కేసు నమోదు

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. అక్కడక్కడ చెదురుముదురు సంఘటనలు మినహా సజావుగా కొనసాగు తున్నాయి. కాగా, జగిత్యాల జిల్లాలో ఓటు వేస్తూ ఓ యువకుడు ఫొటో తీసుకున్నాడు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామంలోని 8 పోలింగ్ బూత్‌లో చోటు చేసుకుంది. రెడ్డవేని జయరాజ్ అనే వ్యక్తి ఓటు వేస్తూ సెల్ఫీ తీసుకున్నాడు. ఎన్నికల అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# యువకుడిని కాపాడిన పోలీసులు

**- ఆత్మహత్యాయత్నం చేసుకోబోయిన యువకుడు**

**- సకాలంలో స్పందించిన పోలీసులు దక్కిన వ్యక్తి నిండు ప్రాణం**

జగద్గిరిగుట్ట: వ్యక్తిగత కారణాలవల్ల ఆత్మహత్యాయత్నానికి చేసుకోబోయిన యువకుడిని సమాచారం తెలుసుకున్న జగద్గిరిగుట్ట పెట్రోల్ పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. జగద్గిరిగుట్ట సిఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా ఏలూరు ప్రాంతానికి చెందిన సాయికుమార్ గత కొన్నేండ్ల క్రితం వలస వచ్చి జగద్గిరిగుట్ట ప్రాంతంలోని అంజయ్య నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ%ా% ప్రయివేటు ఉద్యోగం చేసుకుంటు న్నాడు. గత కొద్దిరోజుల నుంచి వ్యక్తిగత కారణాల చేత మనోవేదనకు గురయ్యానని పోలీసులకు తెలిపాడు. దీంతో జీవితంపై విసుగు చెంది ఆత్మహత్య చేసుకునెందుకు సిద్ధం అయ్యాడు. తను చనిపోతున్నా అని అర్ధరాత్రి ఏలూరు లో ఉంటున్న తన బంధువు వరుస అయిన బావ అనిల్‌కు ఫోన్ చేసి, జాగ్రత అంటూ ఫోన్ కట్ చేశాడు. వెంటనే అనిల్ జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఫోన్ సిగల్స్ ఆధారంగా సాయి



కుమార్ అడ్రసు తెలుసుకొని హుటా హుటిన అక్కడికి చేరకుని కాపాడి, పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. సకాలంలో స్పందించి, సాయి కుమార్‌ను రక్షించిన జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్‌కు, పెట్రోల్ మొబైల్ పోలీసులు గోపాల్, వినరులకు సాయి కుటుంబ సభ్యులు అనిల్ కృతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చాకచక్యంగా వ్యవరించిన తమ సిబ్బందిని సీఐ. క్రాంతి కుమార్ అభినందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భూ కబ్జాదారుల ఆగడాలను అరికట్టాలి

అల్వాల్: కొందరు భూ కబ్జాదారులు తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని ఆక్రమించి రాత్రికి రాత్రే పహరీ నిర్మాణం చేపట్టారని, ఇదేమిటని ప్రశ్నిస్తే బెదిరింపులకు గురి చేస్తున్నారని ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తన భూమిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. బాధితుడు వారాల జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ అల్వాల్ సర్కిల్ పాకాల కుంటలో తన తండ్రి నుంచి తనకు సంక్రమించిన భూమిని కొందరు భూ కబ్జాదారులు ఆక్రమిస్తున్నారని,

ఈ విషయమై అధికారులకు, పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. అల్వాల్ మండల పరిధిలోని పాకాల కుంట, పంచశీల కాలని సమీపంలోని (అల్వాల్ హిల్స్ లో) గల సర్వే నంబర్ 566, 567, 568, 569, 570, 571,లో గల 20 ఎకరాలలో ఆక్రమణకు గురికాగా పోను 10 ఎకరాలలో ఉన్న స్థలంలో రాత్రికి రాత్రి ప్రహరీ గోడ గేటు నిర్మాణం చేపడుతున్నారని, ఇట్టి స్థలంలో ఉన్న కుంటలో మట్టి నింపేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సంబంధిత మున్సిపల్ అధికారులకు, పోలీసు ఉన్నతాధికారులకు, ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తండ్రి నారాయణస్వామి కి ఎనిమిది మంది సంతానం ఉన్నామని, తమ తండ్రి ద్వారా సదరు భూమి తమకు వచ్చిందని, తుమ్మిదా భూమికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయని, అదేవిధంగా తమకు ప్రభుత్వ చట్టం 38 ఈ ద్వారా ఆకుపెన్సి రైట్ సర్టిఫికెట్



2018 సంవత్సరంలోనే వచ్చిందని, అట్టి భూమి ఎవరికి రిజిస్ట్రేషన్ కానీ, బదిలీ కానీ చెల్లదని తెలిపారు. ఇట్టి భూమిపై సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో, మండల కార్యాలయంలో, స్థానిక పోలీస్ స్టేషన్‌లో, ఏసీపీ కార్యాలయం లో ఫిర్యాదు చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ భూమి కేసు కోర్టులో ఉన్నదని ఎవరూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ కబ్జాదారులు అక్రమంగా ప్రహరీ నిర్మాణాన్ని రాత్రికి రాత్రి ఏర్పాటు చేస్తూ.. భూమిలో ఉన్న నీటి కుంట ను పూర్తిగా జేసీబీ, టిప్పర్ల ద్వారా మట్టితో నింపుతున్నారని ఆందోళన చెంది మీడియా ద్వారా పేర్కొనడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి స్థలంలోకి వస్తే తమని చంపేస్తామని భూ కబ్జాదారులు బెదిరిస్తున్నారని, తమకు ప్రాణ హాని ఉందని, సంబంధిత అధికారులు, పోలీసులు తమకు రక్షణ కల్పించి, తమ భూమిని కబ్జాదారుల నుండి కాపాడాలని కోరారు.

# 'అందుబాటులోకి వచ్చిన సాధికార బౌద్ధ సాహిత్యం'

కల్చరల్: సుమారు ఇరవై ఏండ్ల క్రితం తెలుగు భాషలో కల్పిత వూహా జనిత కథలు తప్ప బౌద్ధం గురించి వాస్తవాలు అందు బాటులో లేవని నేడు సాధికార బౌద్ధ సాహిత్యం తెలుగులో అందుబాటులోకి వచ్చిందని విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి సీ.ఆంజనేయ రెడ్డి అన్నారు . ఈ సాహిత్య ప్రచురణలో కె కె రాజా కృషి ప్రశంస నీయమని అభినందించారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై లతా రాజా ఫౌండేషన్ నిర్వహణ లో బౌద్ధ సాహిత్యం పై పది రచనలతో పాటు ఇతర నాలుగుసామాజిక సాహిత్య సంపుటి ల ఆవిష్కరణ జరిగింది. ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ వేయి సంవత్సరాల క్రితం పాళీ భాషలో ఉన్న బౌద్ధ సాహిత్యం తెలుగులోకి సమగ్రం తీసుకువ స్తున్నమని తెలిపారు. అంబేకరిస్థులుగా కాక బుద్ధిస్టులుగా చెప్పుకోవటం వల్ల జనాభా సంఖ్య పెరుగుతుందని చెప్పారు.

అన్ని దానాలలో ధర్మ దానం గొప్పదని బుద్ధిజం చెబుతుందని ధనం సంపాదించి ఉత్తమ సాహిత్య ప్రచురణలు ఖర్చు పెడుతున్న రాజా అభినందనీయులు అన్నారు. బుద్ధిస్ట్ బుర్ర గోవర్ధన్ మాట్లా డుతూ వైదిక సాహిత్యం కన్నా ముందు బుద్ధ సాహిత్యం ఉందన్నారు. కొన్ని కుట్రల వల్ల మరుగు పడిందన్నారు. మానవత్వం కావాలంటే బుద్ధుని బోధనలు సందేశం ప్రచారం కావాలన్నారు. రాజా సతీమణి లత పేరిట ఫౌండేషన్ ద్వారా రాజా చేస్తున్న సేవ ప్రశంసనీయం అన్నారు. ప్రజా వాగ్గేయ కారుడు జయరాజ్ మాట్లాడుతూ నాలో ఉన్న క్యాన్సర్ వంటి రుగ్మతలు అన్ని పోగొట్టుకొని బుద్ధిస్ట్ గా మారానన్నారు. గ్రీక్ యోధుడు అలెగ్జాండర్ శాస్త్రవేత్త ఇన్స్టీన్ వంటి వారిని బుద్ధిజం ప్రభావితం చేసింది అన్నారు. సంస్థ స్థాపకుడు రాజా మాట్లాడుతూ గ్రూప్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారికి వారు ఉండే హాస్టల్ కు లక్ష రూపాయలు విలువ



చేసే గ్రంథాలు అందజేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు తమ సంస్థ 90 గ్రంథాలు ప్రచురించిందని తెలిపారు. గ్రంథాలు వరుసగా అంబేద్కర్ రచన కా న్వర్సెషన్, సుమేధ బోధ రచన సామాజిక బౌద్ధ ధర్మం, పారనంది నిర్మల రచన సంస్కరణలకు ప్రేరణ జ్యోతి బాయి పూలే, ధర్మ భూమి రచన నిర్మల, డాక్టర్ పద్మాకర్ రచన ఆదర్శం ఆచరణ, బండి సత్యనారాయణ రచన శీలం ఉత్తమ జీవనం, నిర్మల రచన అడవి మంటలు,రాష్ట్ర పాల్ రచన బౌద్ధం నియమిత కర్మలు, బొర్ర గోవర్ధన్ రచన సీల శిఖరం, ధర్మ చక్రం,తెలుగు భాషా సాహిత్యం సంకలనం సంపాదకులువిశ్వనాద్ రెడ్డి, ఈమని నాగి రెడ్డి, నటరాజ్ శాఖ్య రచననారాయణగురు ,డాక్టర్ బండి సత్యనారాయణ రచన నిర్వణ,పట్టాభి రామయ్య రచన నిత్య చర్య లను వరుసగా తాత్యా రావు,ఈమని నాగి రెడ్డి,ప్రొఫెసర్ సుధ రాణి,మధుకర్,డాక్టర్ పద్మాకర్, బండి సత్యనారాయణ, కె వీ.రావు,నటరాజ శాఖ్య,జయరాజ్,మల్లేపల్లి లక్ష్మయ్య, ఆంజనేయ రెడ్డి, బి.నర్సింగ్ రావు, బొర్ర గోవర్ధన్ వినోద్ కుమార్ లు ఆవిష్కరించారు

# మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు.. ముగ్గురు మృతి

హైదరాబాద్ : జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మొబైల్ టిఫిన్ సెంటర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొడంతో ముగ్గురు దుర్మరణం చెందారు.

ఈ విషాదకర సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రఘునాథపల్లిలో నేషనల్ హైవేపై హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో మొబైల్ టిఫిన్ సెంటర్‌ను అతివేగంతో వచ్చిన ఆర్టీసీ గరుడ ఢీకొట్టింది.



ఈ ప్రమాదంలో అక్కడే టిఫిన్ చేస్తున్న ముగ్గురు వ్యక్తులు స్పాట్‌లోనే మృతి చెందారు. మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఈదురుగాలుల వర్షం..

**- ఇబ్బంది పడ్డ ఎన్నికల సిబ్బంది**

**- ఆసిఫాబాద్‌లో తెగిన గుండివాగు తాత్కాలిక వంతెన**

కామారెడ్డి / ఆసిఫాబాద్: అకాల వర్షానికి, ఈదురుగాలులకు ఎన్నికల కోసం సిద్ధమవుతున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మైదానంలో అధికారులు ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆదివారం అనుకోకుండా ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్ పడిపోయి టెంట్ నుంచి నీళ్లు రావడంతో నిలబడటానికి సైతం సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఫ్లెక్సీలు కప్పుకొని వర్షం పడకుండా జాగ్రత్త పడగా, కొందరు తమ సామగ్రిని పట్టుకొని కళాశాల వరండాలోకి పరుగులు తీశారు. భారీ వర్షం కురవడంతో ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నా ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్ కలవకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు.



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పీటీజీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఉన్న రిజర్వు సిబ్బందికి వేసిన టెంట్లు కూలిపోవడంతో పక్కనే ఉన్న వరండాలోకి వెళ్లారు. గుండి గ్రామానికి వెళ్లే తాత్కాలిక వంతెన తెగిపోవడంతో పోలింగ్ సిబ్బంది కమన, కన్నరగాం గ్రామాల మీదుగా గ్రామానికి చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వర్షానికి నీరు నిలిచిపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు. బాలుర పాఠశాలలో ఆదర్శ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు వర్షం అడ్డంకిగా మారింది.

# పిడుగుపాటుకు ముగ్గురు మృతి

**- మెదక్ జిల్లాలో తడుస్తున్న ధాన్యానికి టార్పాలిన్ కప్పుతుండగా తాతా మనుమడు మృతి**

**- ఆదిలాబాద్‌లో ఒకరు..**

పెద్ద శంకరంపేట/ఆదిలాబాద్: ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో పిడుగులు పడి ముగ్గురు మృతి చెందిన ఘటన మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆదివారం జరిగింది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రమైన ఐకేపీ సెంటర్‌లో ఆరబోసిన వరి ధాన్యం వర్షానికి తడుస్తోందని ఆదివారం సాయంత్రం తాటిపత్రులు కప్పడానికి రైతు పాల్వంచ శ్రీరాములు(50), అతని మనమడు విశాల్ (11) వెళ్లారు. వరికుప్పపై సంచులు కప్పి చెట్ల కిందికి వెళితే పిడుగు పడుతుందనే భయంతో అక్కడే వరికుప్ప వద్ద నెత్తులపై సంచులు కప్పుకొని కూర్చోగా వారిపై పిడుగుపడి మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో



ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాగా పిడుగు పడి, ఏడుగురికి గాయాలయ్యాయి. అందులో మామిడిపెల్లి కిరణ్(44) మృతి చెందాడు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పిడుగు పాటుకు గురైన వారిలో గ్రామస్తులు కోల భోజన్న, టింగేని రమేష్, సంటెన్న, కుందేని రమేష్, భీంరావు, అమ్ములు రమేష్ ఉన్నారు.

# సమస్యాత్మక ప్రాంతాలపై సాయుధబలగాల డేగకన్ను

**- 30 వేల మందికిపైగా బైండోవర్**

**- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల బందోబస్తు**

లోక్‌సభ ఎన్నిలను పురస్కరించుకుని లక్ష మందికిపైగా పోలీసులు అప్రమత్తం అయ్యారు. సోమవారం రాష్ట్రంలో జరిగే 17 లోక్‌సభ, కంటోన్మెంట్ శాసనసభ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుండటంతో ఆదివారం సాయంత్రం నుంచే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులను మోహరించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడటానికి కేంద్ర సాయుధబలగాలు, ఏపీఎస్పీ బెటాలియన్లు, సివిల్ పోలీసులు, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ సాయుధబలగాలు, హోంగార్డులు, ఇతర రాష్ట్రాల పోలీసులు కలిపి మొత్తం లక్ష మందికిపైగా పోలీసులు ఎన్నికల బందోబస్తులో పాలుపంచుకోనున్నారు. ముఖ్యంగా అత్యంత సున్నిత మైన ప్రాంతాలు, మతఘర్షణలు, రాజకీయ వైషమ్యాలు చెలరేగే పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలతో కూడిన మెరుపు దళాలు కాపుకాస్తున్నాయి.

అలాగే, మొబైల్ స్పెషల్ దళాలు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో ప్రతి పది నిమిషాలకు ఒకసారి తిరుగుతూ బందోబస్తును పర్యవేక్షిస్తున్నాయి. మరోపక్క ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలో ప్రవేశించే 89 అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద కూడా సాయుధబలగాలతో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ప్రధాన మూడు కమిషనరేట్ల పరిధిలో 30 వేల మందికిపైగా రౌడీలు, గుండాలు, పాత నేరస్తులను బైండోవర్ చేశారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగడానికి గానూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ప్రతిక్షణం క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు. తగిన చర్యలను తీసుకుంటున్నారు. రాష్ట్ర డీజీపీ రవిగుప్తా స్వీయపర్యవేక్షణలో శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ సంజరు కుమార్ జైన్ నేతృత్వంలో ఈ కంట్రోల్ రూమ్ నడిపిస్తున్నారు. పోలింగ్



ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు దశ వరకు ఈ కంట్రోల్ రూమ్ పనిచేస్తున్నదని డీజీపీ రవిగుప్తా తెలిపారు.

ఇదిలా ఉంటే పోలింగ్ పూర్తికాగానే కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేలా ప్రత్యేక సెక్యూరిటీ దళాలను కూడా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ బెటాలియన్, సివిల్ పోలీసులతో మూడంచెలుగా భద్రతను ఏర్పాటు చేశారు. ఇక, రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం ఉన్న ఉత్తర తెలంగాణలోని ఐదు పార్లమెంట్ నియోజకవర్గాలలో మావోయిస్టుల నుంచి ఎలాంటి ప్రమాదం రాకుండా గ్రేహౌండ్స్ బలగాలతో కూబింగ్ ఆపరేషన్లను ఉధృతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్లను ప్రలోభపెట్టే ప్రక్రియకు, డబ్బుల పంపిణీని అడ్డుకునేందుకు అనుమానిత ప్రాంతాలపై పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. పలుచోట్ల డబ్బులు, మద్యంతో ఇతర గిఫ్టులను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు అవాంతరాలు తలపెడితే ఎంతటి వారినైనా వదలిపెట్టబోమని డీజీపీ రవిగుప్తా హెచ్చరించారు.

# ఓటుహక్కు వినియోగించుకోనున్న ప్రముఖులు

**- కొడంగల్‌లో సీఎం రేవంత్, చింతమడకలో కేసీఆర్**

హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రముఖులు నేడు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 237లో, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్దిపేట జిల్లా చింతమడకలో, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి బర్కత్‌పురలోని దీక్షా హైస్కూల్‌లో ఓటేయనున్నారు. రాంనగర్‌లోని జేవీ హైస్కూల్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మలక్‌పేట జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ఎస్‌ఆర్‌నగర్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 188లో ఓటేస్తారు. మంత్రి దామోదర రాజనర్సింహ సంగారెడ్డి జోగిపేటలో, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దంపతులు నందినగర్ కమ్యూనిటీ హాల్‌లో, మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట భరత్‌నగర్‌లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

జూబ్లీహిల్స్ ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో జూనియర్ ఎన్టీఆర్, ప్రణతి, బీఎస్ఎన్ఎల్ సెంటర్‌లో అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు అరవింద్, అల్లు శిరీష్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మహేశ్‌బాబు, నమ్రత, మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మి, మనోజ్, విజయ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, శ్రీకాంత్, జీవిత రాజశేఖర్ ఓటేయనున్నారు. జూబ్లీహిల్స్ క్లబ్‌లో చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన, నితిన్. ఎమ్మెల్యే కాలనీలో రవితేజ, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్, మణికొండ హైస్కూల్‌లో వెంకటేశ్, బ్రహ్మానందం, షేక్‌పేట్ ఇంటర్నేషనల్ స్కూల్ లో దర్శకులు రాజమౌళి ఓటేస్తారు. యూసఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రభుత్వ పాఠశాలలో అల్లరి నరేష్, సలీంనగర్ పోలింగ్ బూత్‌లో తనికెళ్ల భరణి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

# బీఎల్‌ఓ నిర్లక్ష్యం - బీ ఆందోళనలో ఓటర్లు

**- పట్టించుకోని మండల స్థాయి అధికారులు.**

మల్హర్ రావు: బీఎల్‌ఓల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఓటర్లకు శాపంగా మారింది. ఎన్నికలకు రెండు మూడు రోజుల ముందే ఓటువేసి స్లిప్స్ ఇవ్వాలి కానీ మండల కేంద్రమైన తాడిచెర్ల బీఎల్‌ఓల బాధ్యత రహితంగా వ్యవరించి ఓటర్లకు ముందస్తుగా స్లిప్స్ ఇవ్వకపోగా, ఓటింగ్ ప్రారంభించిన సోమవారం పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని హడావిడి చేస్తూ స్లిప్స్ ఇవ్వడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో చాలామంది ఓటర్ల పేర్లు లేవని,మేము స్లిప్స్ ఇవ్వలేమని చెప్పడంతో ఓటర్లు ఇంటిబాట పట్టడం కనిపిస్తోంది. ముందస్తుగా స్లిప్స్ ఇవ్వాల్సిన బిఎల్‌ఓ ల నిర్లక్ష్యం అయితే..

వీరిపై పర్యవేక్షణ చేయాల్సిన మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం మరో కారణమని తెలుస్తుంది. అలాగే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కరువైపోయాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటు ఓటర్లకు స్లిప్స్ ఇవ్వకపోవడం,అటు పోలింగ్



కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడం చుస్తే జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు బేఖాతర్ చేసినట్లుగా తెలుస్తోంది.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను

## పరిశీలించిన పోలీస్ కమీషనర్

కరీంనగర్: కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా ఉన్న పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి హవెలిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, రేకుర్తిలోనిలయోల పాఠశాల, తీగలగుట్టపల్లి లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు పలు ఇతర పోలింగ్ కేంద్రాలను సందర్శించి విధుల్లో ఉన్న సిబ్బందిని ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సమస్యలు ఉన్నట్లయితే దృష్టికి తీసుకురావాలన్నారు. ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే అందుబాటులో వుండే సమీప అధికారులకు తెలియచేయాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద గుమిగూడుట ఎటువంటి అవాంఛానీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికలు ప్రశాంతంగా



ముగిసేలా కృషి చేయాలన్నారు.

# డిచ్ పల్లి, ఇందల్ వాయిలో పోలింగ్ ప్రశాంతం

**- పలుచోట్ల మొరాయించిన ఈవీయంలు..**

డిచ్ పల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 6 గంటల వరకు కొనసాగింది. మండలంలోని ఘన్పూర్, ధర్మారం, ముల్లంగి గ్రామాల్లో పోలింగ్ ప్రారంభం కాగానే ఈవీయంలు మొరాయించటంతో అరగంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. అనంతరం టెక్నీషియన్స్ ఈవీయంలను సరి చేయటంతో తిరిగి పోలింగ్ ప్రారంభమైంది. ఎండవేడిమిని దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం లోపే ఓటు వేయడానికి ప్రజలు బారులు తీరారు. మధ్యాహ్నం లోపే 80 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 తర్వాత ఎండవేడిమి చల్లబడిన తర్వాత తిరిగి ఓటర్లు పోలింగ్ బూత్లకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ధర్మారం(బి) లో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్రావు దంపతులు, రాంపూర్లో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి, బీజేపీ జిల్లా అధ్యక్షులు కులాచారి దినేష్కుమార్, అమృతాపూర్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. డీసీసీబీ ప్రధాన కార్యదర్శి కె. నగేష్ రెడ్డి ముల్లంగి(ఐ) గ్రామంలో పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఇందల్ వాయి మండలంలో%ా

%ఇందల్ వాయి మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది.దర్పల్లి మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి గౌరరంలో మాజీ సర్పంచ్ ఇమ్మడి లక్ష్మి ముదిరాజ్, నల్లవెల్లి లో తాజా మాజీ ఐడిసిఎంఎస్



చైర్మన్ సాంబార్ మోహన్ కుంటుబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 తర్వాత పోలింగ్ ముగిసిన అనంతరం పోలింగ్ సిబ్బంది ఈవీఎంలను తమకు కేటాయించిన వాహనాల్లో పోలీసు భద్రత నడుమ డిచ్ పల్లి సీఎంసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్లకు పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు.

# కారు మబ్బులు..రైతుల గుండెల్లో గుబులు..

మల్హర్ రావు: కమ్ముకొస్తున్న కారు మబ్బులతో రైతుల గుండెల్లో గుబులు వస్తుంది.ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో గత రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలతో రైతుల ఆశలు నీళ్లయ్యాయి.

గత నాలుగు రోజులుగా కమ్ముకొస్తున్న మేఘాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.పలు చోట్ల స్వల్పంగా వర్షాలు పడుతుండటంతో రైతులు ధాన్యాన్ని కుప్పలు చేస్తూ కవర్లు కప్పుతూ బిజీబిజీగా ఉన్నారు.ప్రకృతి రైతులను పగబట్టింది. అకాల వర్షాలతో రైతుల్లో ఆందోళన తీవ్రమై%శీ%ది. విక్రయించదానికి కల్లాల్లోకి తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం బస్తాలు నింపి కాంటా పెట్టడానికి సిద్ధంగా ఉండగా అకాల వర్షంతో తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యం కొత లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి భరోసా ఇవ్వాలని రైతు సంఘం నాయకుడు అక్కల బాపు యాదవ్ కోరుతున్నారు. ఆకాలంగా కురిసిన



వర్షాలకు తాడిచెర్ల, మల్లారం,రుద్రారం గ్రామాల్లో రైతులు విక్రయించడానికి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాసులు తడిసి ముద్దయ్యాయి. నిలువునా కోతకు వచ్చిన వరి పొలాలు గాలివాన బీభత్సంతో నేలకొరిగాయి. ఇప్పటికైన ప్రభుత్వాలు మద్దతు ధరతో ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# ఎండను సైతం లెక్కచేయని ఓటర్లు

మోపాల్ : భానుడు నిప్పులు చెరుగుతున్న సరే ఓటర్లు లెక్క చేయడం లేదు. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తుతున్నారు. మోపాల్ మండలంలో ఎన్నికలో సోమవారం జరుగుతున్న పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకే 45 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. పట్టణ ప్రాంతంలో కన్నా గ్రామీణ ప్రాంతాల్లో నే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. మండుటెండలోనూ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావడం అందులోనూ ఉక్కపోతతోనే క్యూ లైన్లో నిలబడడం గమనార్హం. తీవ్రమైన ఎండలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు వేసినప్పటికీ ఓటర్ల ఎండకు తాళలేక పోయారు. అయితే పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడం తో ఓటర్లు ఉపశమనం పొందారు. నిజామాబాద్ నగరంలో విద్యావంతు లు ఉన్న ప్రాంతాల్లోనే పోలింగ్ ఆశించినమేరకు జరగడం లేదు. పేద ప్రజలుండే ప్రాంతాల్లో మాత్రం పోలింగ్ కేంద్రాలు ఓటర్ల కిక్కిరిసి పోయా యి. నిజానికి ఓటు చైతన్యం మాత్రం గ్రామీణ ప్రాంతాల్లోనే వికసించింది. ఓటింగ్ సరళని పరిశీలిస్తే అత్యధిక ఓటింగ్ శాతం గ్రామాలలో జరుగుతుంది. అత్యల్పంగా పట్టణంలో జరుగుతుంది అభివృద్ధి మాత్రం పట్టణాలలో అత్యధికంగా గ్రామాలలో అత్యల్పంగా జరుగుతన్నది ప్రభుత్వాలు కూడా అన్ని ఆలోచించుకొని ఓటు శాతం ఎక్కువగా ఉన్న గల గ్రామాల అభివృద్ధి సాధించి అభివృద్ధికి పాటుపడాలి గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు ఉంటాయి కాబట్టి గ్రామాలలో అభివృద్ధికి సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వాలు సహకరించాలని ఓటు హక్కు ద్వారా ఓటు చైతన్యంతో గ్రామాలలో అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకుంటారు. నిజామాబాద్ జిల్లా ఎంపీ స్థానంలో ముఖ్యంగా కాంగ్రెస్ అభ్యర్థి టీ జీవన్ రెడ్డి కి మరియు బిజెపి అభ్యర్థి అరవింద్ కి మధ్యనే పోటీ ఉండేవిధంగా ఉంది మారుమూల గ్రామం అయినటువంటి మంచిప్ప గ్రామంలో సాయంత్రం ఐదు గంటల వరకు 78% ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడం జరిగింది.

# బైక్ పెట్రోల్ ట్యాంక్ పేలి 10 మందికి గాయాలు..

హైదరాబాద్: ద్విచక్రవాహనం పెట్రోల్ ట్యాంక్ పేలి పది మందికి గాయాలైన ఘటన హైదరాబాద్ పాతబస్తీ పరిధిలో జరిగింది. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మొఘల్‌పురా అస్లా ఫంక్షన్‌హాల్ సమీపంలో రోడ్‌పై వెళ్తోన్న బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బైకర్ వెంటనే వాహనాన్ని ఆపేశాడు. మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించారు. ఈ క్రమంలో పెట్రోల్ ట్యాంక్ ఒక్కసారిగా పేలిపోయింది.

క్షతగాత్రులను సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న భవానీ నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకోవడానాకి ప్రయత్నిస్తున్నారు.

# కేంద్ర పన్ను రాబడిలో దక్షిణాదిపై వివక్ష.. రూపాయి ఇచ్చే బీహార్‌కు రూ.7.. తెలంగాణకు అర్ధరూపాయీ ఇవ్వట్లే

**తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల పరిస్థితి కూడా ఇంతే**

**న్యాయంగా రావాల్సిన వాటాలోనూ కేంద్రం మొండిచేయి**

**జనాభా, తక్కువ తలసరి గీటురాయిగా ఏకపక్ష నిబంధనలు**

**15వ ఫైనాన్స్ కమిషన్ రూల్స్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం**

హైదరాబాద్ : కేంద్ర పన్ను రాబడిలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయంగా రావాల్సిన వాటా దక్కట్లేదు. ఉత్తరాది రాష్ట్రం బీహార్ వివిధ పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి ఇస్తున్నదనుకొంటే, దానికి ప్రతిగా కేంద్రం.. ఆ రాష్ట్రానికి రూ. 7.26 తిరిగి చెల్లిస్తున్నది. ఇదే సమయంలో అదే రూపాయి ఇస్తున్న తెలంగాణకు కేవలం 0.47 పైసలనే విదిలిస్తున్నది. ఒక్క తెలంగాణకే కాదు.. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ విషయంలోనూ ఇలాగే పక్షపాతధోరణి అవలంబిస్తున్నది. అందుకే, కేంద్ర పన్నుల్లో తమకు తక్కువ వాటా ఇస్తున్నారని తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రప్రభుత్వంపై ఎప్పటి నుంచో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీడీపీలో 32 శాతం మేర వాటాని కలిగి ఉన్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలకు ఇచ్చే ఆదాయంలో పక్షపాతం ఎందుకు జరుగుతున్నది? 15వ ఆర్థిక సంఘం సిఫారసులతో దక్షిణాదికి జరుగుతున్న నష్టమేంటి?

నిధుల కేటాయింపులు ఇలా..

రాష్ట్రాల సమూహమే దేశం. అంటే కేంద్రప్రభుత్వానికి ఆదాయమంటూ వస్తే అది రాష్ట్రాల నుంచే రావాలి. అలా రాష్ట్రాల నుంచి సేకరించిన నిధులు కేంద్రానికి వెళ్ళిన తర్వాత కొన్ని ప్రమాణాలకు అనుగుణంగా కొంత మొత్తంలో రాష్ట్రాలకు తిరిగి పంపిణీ అవుతాయి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 280 ప్రకారం.. ఈ నిధుల కేటాయింపులను




నిర్ణయించడానికి ప్రతీ ఐదేండ్లకు ఓసారి ఆర్థిక సంఘాలను (ఫైనాన్స్ కమిషన్) ఏర్పాటు చేస్తారు. కమిషన్‌పై నిర్ణయాధికారం కేంద్రానిదే. ఈ ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు పంచుకొంటాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం సిఫారసులు (2021-2026) అమలులో ఉన్నాయి. అయితే, 14వ ఆర్థిక సంఘం ఉన్నంత వరకు కేంద్రం ఆదాయంలో 42 శాతం వాటా రాష్ట్రాలకు పంపిణీ అయ్యేది. 15వ కమిషన్ సిఫారసుల్లో ఈ వాటాను 41 శాతానికి తగ్గించారు.

**ప్రమాణాలు ఏమిటంటే?**

15వ ఆర్థిక సంఘం సిఫారసుల ప్రకారం.. ఆరు ప్రమాణాలను బట్టి రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరుగుతున్నది. రాష్ట్రాల విస్తీర్ణం (15%), రాష్ట్రాల జనాభా (15%), అత్యల్ప తలసరి ఆదాయం (45%), అటవీ, పర్యావరణం (10%), పన్ను వసూలులో రాష్ట్రాల సామర్థ్యం (2.5%), జనాభా నియంత్రణలో రాష్ట్రాల పనితీరు (12.5%)ను బట్టి ఈ కేటాయింపులు చేస్తున్నారు. అయితే, 10వ, 11వ, 12వ, 13వ, 14వ ఆర్థిక సంఘాలు రాష్ట్రాల జనాభాను 1971 సంవత్సర లెక్కల ప్రకారం తీసుకొంటే, 15వ ఆర్థిక సంఘం మాత్రం 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకొన్నది. అలాగే, నిధుల పంపిణీలో మారిన పరిస్థితులను బట్టి కాకుండా అత్యల్ప తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలకు 45 శాతం వాటాను కేటాయించింది. ఈ రెండు కారణాల వల్లే.. కేంద్రానికి అత్యధిక రాబడిని వచ్చేలా చేసినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతున్నది.

**జనాభా, రాబడిలో మార్పులు ఇలా..**

70వ దశకం మధ్యలో జనాభా పెరుగుదలను నియంత్రించే ప్రయత్నాలను కేంద్రం తీవ్రతరం చేసింది. జననాలను కట్టడి చేసే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలను ప్రకటించింది. దీంతో దక్షిణాదిన ఉన్న కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు జనాభా నియంత్రణను చేపడితే.. ఉత్తరాది రాష్ట్రాల్లో అలా జరగలేదు. దీంతో ఉత్తరాదిన జనవిస్ఫోటనం జరిగింది. పరిశ్రమల స్థాపన, ఉద్యోగావకాశాలు తదితర అభివృద్ధి పనులు దక్షిణాదిన ఊపందుకొని ప్రజల తలసరి ఆదాయం పెరిగితే, ప్రభుత్వాల వైఫ్యల్యం కారణంగా యూపీ, బీహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో అలా జరుగలేదు. దీంతో జనాభాలో 19 శాతం వాటా కూడా లేని దక్షిణాది రాష్ట్రాలు .. ప్రస్తుతం జీడీపీలో 32 శాతం వాటాని కలిగిఉన్నాయి. 1976 తర్వాత ఏర్పాటైన ఫైనాన్స్ కమిషన్లు (10వ ఫైనాన్స్ కమిషన్ నుంచి) 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకొన్నాయి. 14వ ఆర్థిక సంఘం వరకు ఇదే పద్ధతి కొనసాగింది. ఆ లెక్కన జనాభా నియంత్రణ పాటించకముందు ఉన్న జనాభా లెక్కలను తీసుకోవడంతో రాబడి వాటాల్లో దక్షిణాదికి కొంత మేర న్యాయం జరిగింది.

కానీ, 15వ ఆర్థిక సంఘం తాజా జనాభా లెక్కలను (2011నాటి జనాభా లెక్కలు) ఉపయోగిస్తున్నది. అంతేకాకుండా.. 2011నాటి రాష్ట్రాల జనాభాకు, అత్యల్ప తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రాలకు 60 శాతం మేర ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో జనాభా నియంత్రణ పాటించి, పౌరుల తలసరి ఆదాయాన్ని పెంచిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగింది. జనాభా నియంత్రణలో మంచి పనితీరు కనబర్చిన రాష్ట్రాలకు 12.5% పాయింట్లు ఇస్తామన్నప్పటికీ, దీనికి 1971 కాకుండా 2011వ సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొన్నారు. అలా కూడా దక్షిణాది రాష్ట్రాలకు నష్టమే మిగిలింది. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే.. జనాభాను నియంత్రించకుండా, పౌరుల ఉపాధి కల్పనను గాలికొదిలేసి వారి తలసరి ఆదాయానికి గండికొట్టిన ఉత్తరాది రాష్ట్రాలకే కేంద్రం ఎక్కువ నిధులను కేటాయిస్తున్నది. అందుకే, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ పరిణామాన్ని ఖండిస్తున్నారు. దేశాభివృద్ధికి చోదకశక్తిగా పనిచేస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు న్యాయంగా దక్కాల్సిన వాటాను ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

# విమాన సిబ్బందిని చీరకట్టుకునేలా చేసింది, నేర్పించింది ఆమె!

విమాన సిబ్బందిలో మహిళలు పనిచేయాలంటే కచ్చితంగా స్కర్టులు, కోట్లు ధరించాల్సిందే. అందులోనూ లండన్‌లో అయితే కచ్చితంగా ఆ ఆహార్యంలోనే ఉండాల్సిందే. భారతీయ మహిళలైనా ఆ రూల్స్ పాటించక తపని రోజులవి. కానీ ఓ మహిళ ఆ ఎయిర్ ఇండియా రూల్స్‌నే తిరగరాసింది. చీరకట్టుతోనే పనిచేస్తామని తెగేసి చెప్పడమే గాక ఉద్యమం చేసి మరీ తను అనుకున్నది సాధించుకుంది. ఎయిర్ ఇండియాలో పనిచేసే ప్రతి సిబ్బంది చీరకట్టకునేలా చేసింది. అంతేగాదు రాజకీయాల్లోకి రావడానికి మహిళలు భయపడుతున్న రోజుల్లోనే ఆమె రాజకీయాల్లోకి వచ్చి తన గళం వినిపిస్తూ అంచెలంచెలుగా పైకొస్తూ.. మంచి రాజకీయవేత్తగా పేరు తెచ్చుకున్నారు. ఆమె నేటితరానికి, భవిష్యత్తుతరాలకు స్ఫూర్తిగా నిలిచే గొప్ప వ్యక్తి. ఎవరీమె అంటే.. ఆమె పేరు బృందా కారత్. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సరిగ్గా రెండు నెలలకు పుట్టారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వస్తే ఆమె అదే ఏడాది అక్టోబర్ 17న కోల్‌కతాలో జన్మించారు. తండ్రి సూరజ్ లాల్ దాస్ పాకిస్తాన్లోని లాహోర్ నుంచి వలస వచ్చారు. తల్లి ఒషుకోనా మిత్ర బెంగాలి. వీళ్లది ప్రేమ పెళ్లి. పెద్దలు వ్యతిరేకించి మరీ ఓషుకోనా సూరజ్‌ని పెళ్లి చేసుకున్నారు. బృందాకు ఒక సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు. ఐదేళ్ల వయసులో బృందా తన తల్లి ఒషుకోనా మిత్రను కోల్పోయినా తండ్రి తన పిల్లల్ని చాలా స్వేచ్ఛాయుత వాతావరణంలో పెంచారు. ఎన్.డి.టీవీ వ్యవస్థాపక ఎడిటర్ ప్రణయ్ రాయ్‌ని పెళ్లాడిన రాధిక ఆమె చెల్లెలే. బృందా ప్రాథమిక విద్య డెహ్రాడూన్‌లోని వెల్హామ్ బాలికల పాఠశాలలో పూర్తి చేశారు. ఆమె 16 ఏళ్ల వయస్సులో మిరిండా హౌస్‌లోని ఢిల్లీ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాల నుంచి బీఏ పట్టా తీసుకున్నారు. అప్పుడే ఆమె తండ్రి సూరజ్ లాల్ దాస్ తన కుమార్తె బందాను పిలిచి నేను చదువు చెప్పించా. ఇక నువ్వు నీ కాళ్ళపై నిలబడాలని సూచించారు. దీంతో ఆమె 1967లో లండన్ వెళ్లి ఎయిర్ ఇండియాలో చేరారు. అయితే లండన్‌లోని ఎయిర్ ఇండియా విమానయాన సంస్థలో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా స్కర్ట్ లు వేసుకోవాల్సిందే తప్ప చీరె కట్టును




అనుమతించరు. అందుకు ససేమిరా అని బృందాకారత్ తెగేసి చెప్పడం జరిగింది. ఆ టైంలో లండన్ హీత్రూ విమానాశ్రయంలోని ఎయిర్ ఇండియా మేనేజర్ అలాన్. ఆయన కూడా ఏమాత్రం తగ్గేదే లే అంటూ చీర ధరించేందుకు అనమితించమని చెప్పేశారు. అయితే తాము సమ్మె చేస్తామని నిర్భయంగా చెప్పింది బృందాకారత్. చేస్కోండి! అని ఆయన కూడా తీసిపడేసినట్లుగా అన్నారు. దీంతో ఆమె చీరే కట్టుకుంటాం అనే డిమాండ్‌తో నిరవధి కంగా మూడు రోజు సమ్మె చేసి మరీ ఎయిర్ ఇండియా మెడలు వంచింది బృందా. దెబ్బకి ఆ ఎయిర్ ఇండియా మేనేజర్ అలాన్ దిగి రావడమే గాక మీరే విజయం సాధించారు, పైగా ఎయిర్ ఇండియాలో ప్రతి ఒక్కరూ చీరకట్టుకునేలా చేశారు అన్నారట. కానీ బృందాకారత్ ఆ మాటలకు పొంగిపోలేదు. ఈ విజయం తనదేనని ఒప్పుకోలేదు."సారీ, గెలిచింది నేను కాదు. శారీ జాతీయ వాదం" అని చెప్పి ఎయిర్ ఇండియా అధికారిని షాక్‌కి గురయ్యేలా చేసిందట. ఆమె తన వ్యక్తిగత విజయాన్ని జాతీయ వాదంతో పోల్చి చెప్పడమేగాక ఈ విజయాన్ని తన ఖాతాలో వేసుకోవడానికి బదులు అందరికీ వర్తింపజేసేలా మాట్లాడినం దుకు... ఆమెను అభినందించకుండా ఉండలేక పోయారు ఆయన. అంతేగాదు అలా ఎయిర్ ఇండియాకు సెలక్ట్ అయిన బ్రిటిష్ యువతులందరికీ చీరకట్టుకోవడం నేర్పించారు బృందాకారత్. అలా ఆమె అక్కడ కొంతకాలం పనిచేసి ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ తర్వాత సీపీఎం అనుబంధ సంఘాలలో పని చేశారు. మహిళలు రాజకీయాల్లోకి రాని రోజుల్లో వామపక్ష రాజకీయాల వైపుకి వెళ్లారు. అరుదైన కమ్యూనిస్టు రాజకీయ వేత్తగా ఎదిగారు. నుదుట పెద్ద బొట్టు, ఆరడుగులకు పైగా ఎత్తు, చక్కని వర్చసు ఉన్న బృందా అనర్ఘళంగా హిందీ, ఇంగ్లీషు, మళయాళం, బెంగాలీ, కొన్ని తెలుగు పదాలు మాట్లాడగలరు. దేశంలో ఫెమినిస్ట్ ఉద్యమా నికి ఊపిరులు వారిలో బృందా కారత్ ఒకరు. పశ్చిమ బెంగాల్ నుంచి సీపీఎం తరపున రాజ్యసభకు 2005 నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2005లో సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరోకు ఎన్నికైన తొలి మహిళ బృందా కారత్. అంతేగాదు ఆమె సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కారత్ భార్య. ఇక బృందా కారత్ 1975 నాటి ఎమర్జెన్సీ మొదలు కమ్యూనిస్టు ఉద్యమం ఉజ్వలంగా సాగిన 1985 వరకు తన జ్ఞాపకాలను, ఇతర వ్యాసాలను కలిపి ఓ పుస్తక రూపంలో తీసుకువచ్చారు. "యాన్ ఎడ్యుకేషన్ ఫర్ రీటా" పేరిట ఈ పుస్తకాన్ని మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. ఇప్పుడు ఎన్నికల్లో పాల్గొనే నేటితరం యువత తెలుసుకోవాల్సిన ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. ఒక్కో వ్యాసం ఒక్కో ఆణిముత్యం లాంటివే. కనువిప్పు కలిగించేవే. తన 50 ఏళ్ల రాజకీయ జీవితం లోని పదేళ్ల కాలాన్ని గుర్తుపెట్టుకుని క్రమం తప్పకుండా రాయడ మంటే మామూలు విషయం కాదు. పైగా ఈ పుస్తకంలో బ్లాక్ అండ్ వైట్ టీవీలకాలం నుంచి మొదలు పెట్టి ఢిల్లీ గల్లీలలో జరిగిన పోరాటా లను, కష్టకాలంలో జరిగిన చర్చల్ని, నాయకుల తీరు తెన్నులన్ని ంటిని చక్కగా వివరించారు. అయితే అందులో ఉన్న రీటీ ఎవరో కాదు బృందాయే అని పుస్తకం చదివిన తర్వాత గానీ తెలియదు. అయితే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఉండాలపి పోరాడిన ఆమె ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగానే ఉన్నారు. ఇక తానెందుకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాలేదని ప్రశ్నిస్తే మాత్రం బృందా.. తన వయసు 70 దాటిందని, ఈ వయసులో పరిగెత్తడం సమంజసం కాదని చెబుతుంటారామె. మార్చాలంటే యువతీ యువకులే నడుం కట్టాలని చెబుతుం టారు. ఈ ఎన్నికల్లోనైనా మరింత మంది మహిళలు రాజకీయాల్లోకి వస్తారనే ఆశతో చూస్తున్నారామె.

# కరువు కోరల్లో కర్షకులు.. జనగామ, నల్లగొండ, సూర్యాపేటలో దుర్భిక్షం

**1.98 మీటర్ల లోతుకు పడిపోయిన జలాలు**


నల్లగొండ : పదేండ్ల తరువాత మళ్లీ కరువు తరుముకొస్తున్నది. బోర్లు వేస్తే 80 ఫీట్ల లోతులో ఉబికి వచ్చే గంగమ్మ ఇప్పుడు 1.98 మీటర్ల లోతుకు పడిపోయింది. జనగామ జిల్లాలో గత ఏడాది 5.39 మీటర్లపైన ఉన్న భూగర్భ నీటి మట్టాలు..ఈ ఏడాది మార్చి వరకు 7.37 మీటర్ల లోతుకు పడిపోయాయి. కేవలం నెలరోజుల వ్యవధిలోనే 1.98 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోవడంతో కరువుఛాయలను సూచిస్తున్నాయి.

జిల్లాలో యాసంగిలో 1.76 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. జిల్లాలోని ఏడు రిజర్వాయర్లు, 797 చెరువులు ఉండగా, అన్నింట్లోనూ నీటి మట్టాలు గణనీయంగా తగ్గి పోయాయి. ఫలితంగా జిల్లాలో కేవలం 3నెలల వ్యవధిలోనే 50వేలకు పైగా బోర్లు ఒట్టిపోయాయి. దీంతో చివరి దశలో ఉన్న వరికి పూర్తిస్థాయిలో సరిపడా నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

జిల్లాలో చెరువుల ఆయకట్టు కింద 1.50లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యాన్ని నీటి పారుదలశాఖ అధికారులు లక్ష ఎకరాలకు కుదించామని చెబుతున్నా..వాస్తవానికి జిల్లాలో 50వేల ఎకరాల లోపు పంటలకే నీరు అందడంలేదు. దేవరుప్పుల, జనగామ, బచ్చన్నపేట, రఘునాథపల్లి, లింగాలఘనపురం, నర్మెట, చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్ మండలాల్లో ఇప్పటికే వరి ఎండిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

ఇద్దరు మంత్రులు ఉన్నా ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ ఉన్నా కేసీఆర్ సర్కారు నీళ్లిచ్చి రైతాంగాన్ని ఆదుకున్నది. నేడు ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులు సాగర్, కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయించుకుండా చేతులెత్తేశారు. ఫలితంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 3లక్షల ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. పండ్ల తోటలు కూడా తూడ్చుకుపెట్టు కుపోయాయి. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 40 వేలకు పైనే ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. 2015లో సాగర్‌లో 508 అడుగుల మేర నీరు ఉన్నా కేసీఆర్ సర్కారు పంటలను కాపాడేందుకు నీటిని విడుదల చేసింది. ఈసారి 515 అడుగులు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లివ్వడం లేదు. కనీసం ఎండిన పంటల వైపు చూసి, రైతాంగానికి భరోసా ఇచ్చిన ప్రజాప్రతినిధి లేరు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ప్రస్తావనే లేదు. ఈ నేపథ్యంలో తీవ్రంగా కుంగిపోతున్న రైతాంగాన్ని చూసి చలించి భరోసా ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నేడు జనగామ, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటనకు వస్తున్నారు.

సర్కారు నిర్లక్ష్యంతో ఎండిన పంటలు



కేసీఆర్ సర్కారులో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కుంటలు, చెరువులు నింపేవారు. దాంతో బోర్లలో, బావుల్లో నీళ్లు ఉండేవి. కాల్వల ద్వారా నీళ్లు వచ్చేవి. పంటలు బాగా పండాయి. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని వదలడంతో పది రోజులకు పైగా అధికారులు నిర్లక్ష్యం చేశారు. నేడు 11 ఎకరాల్లో వరి పెట్టిన. పంట పూర్తిగా ఎండిపోయింది. నాలుగు లక్షలకు పైగా పెట్టుబడి నష్టపోయా.

## ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

మంథని: పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల్లో సోమవారం పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మంథని పట్టణంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి , మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి , ఆయన సతీమణి వసుమతి మంథని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు పిలుపునిచ్చారు. అదేవిధంగా పెద్దపల్లి పార్లమెంటుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బూడిద తిరుపతి తన స్వగ్రామమైన మంథని మండలం నాగారంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటు వేసి ఆదర్శంగా నిలిచిన.. జాకీర్ పాషా

**కాలితో సంతకం చేస్తున్న జాకీర్ పాషా**

కాగజ్ నగర్: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోనిఫారెస్ట్ డివిజన్ ఆఫీసులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో రెండు చే లు లేని దివ్యాంగుడు జాకీర్ పాషా ఓటు వేసి ఆద ర్శంగా నిలిచాడు. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పాషా కాలి సాయంతోనే సంతకం చేసిన అనంతరం ఓటు వేశాడు. కాగా జాకీర్ పాషా కాలి సహాయంతోనే పెయింట్లు వేయడంతో పాటు రోజువారీ పనులు చేసుకుంటున్నాని తెలిపారు..

## మేధావులు,విద్యావంతులు పోలింగ్ లో పాల్గొనాలి

సిద్దిపేట: సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్ అంబిటస్ స్కూల్ లో 114పోలింగ్ బూత్ లో మాజి మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు కుటుంబ సమేతంగా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్బంగా హరీష్ రావు మాట్లాడుతూ నేను కుటుంబ సభ్యులతో కలిసి భారత్ నగర్ లో ఓటు హక్కును వినియోగించుకున్నా. రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా ప్రజలు పోలింగ్ లో పాల్గొంటున్నారు. గతంలో కంటే ఎక్కువ పట్టణాలలో పోలింగ్ పెరుగుతుంది. ప్రశ్నించే గొంతుక ఉండలని ప్రజలు ఆలోచిస్తున్నారు. మేధావులు,విద్యావంతులు పోలింగ్ లో పాల్గొనాలి. ప్రజాస్వామ్యం బలపడలంటే అందురు ఓటింగ్ లో పాల్గొనాలి. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశం భారత్ దేశం. గత పార్లమెంటు ఎన్నికలలో కంటే పోలింగ్ శాతం పెరుగుతుంది. ప్రజలు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకువాలని అన్నారు.

## మంథని పట్టణంలో ఓటింగ్ సరళిని పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు

మంథని: పార్లమెంట్ ఎన్నికల సందర్బంగా మంథని మున్సిపల్ పరిధిలోని పలు వార్డులోని పోలింగ్ బూతుల్లో వోటింగ్ సరళిని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ లు సోమవారం పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను, ఓటర్లను, కార్యకర్తలను కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అభ్యర్తించారు. ఏడవ వార్డు పరిధిలోని పోలింగ్ బూత్ 91,93 లలో జరుగుతున్న ఓటింగ్ సరళి పై మాజీ ఉపసర్పంచ్, డిసిసి అధికార ప్రతినిధి ఇనుముల సతీష్ తో మంత్రి శ్రీధర్ బాబు కాసేపు ముచ్చటించారు. అదేవిధంగా అంబేద్కర్ చౌరస్తాలో పాన్ షాప్ వద్ద మంత్రి శ్రీధర్ బాబు కాసేపు ఆగి ప్రజలతో ముచ్చటించారు.

## పోలీంగ్ కేంద్రాలను పరిశీలించిన సైబరాబాద్ సీపీ

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని పలు పోలింగ్ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పరిశీలించారు. క్రిటికల్ పోలింగ్ లొకేషన్ చైతన్య విద్యానికేతన్ స్కూల్, మక్దూమ్ నగర్, సందర్శించారు. పోలింగ్ ప్రక్రియ ఒ బందోబస్తు గమనించి, శాంతియుత పోలింగ్ను నిర్వహించేందుకు మరిన్ని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డిసిపీ శ్రీనివాస్ రావు, బాలానగర్ ఏసీపీ హన్మంత్ రావు,జగతగిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు....

## సామాన్యుడిలా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి: లోక్ సభ పోలింగ్ సందర్భంగా పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ సామాన్యుడిలా క్యూ లైన్ లో నిలబడి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ లో రంగంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం సంఖ్య 79 లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల పోలింగ్ సజావుగా జరుగుతుందని, రంగంపల్లి పోలింగ్ కేంద్రంలో ఉన్న తన ఓటు హక్కును తాను బాధ్యతగా వచ్చి వినియోగించుకోవడం జరిగిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని , ప్రజలు తమకు అందించిన పోలింగ్ స్లిప్పులతో పాటు ఓటర్ ఐ.డి. కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకొని వచ్చి పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకో వాలని కలెక్టర్ సూచించారు. మనం వేసే ఓటే మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య ఎన్నికలో మనమంతా భాగస్వామ్యం కావాలని, ప్రతి ఒక్క ఓటరు ఓటు వేయాలని ప్రజాస్వామ్యాన్ని సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ గెలిస్తే ..బాంబులు పేలే ప్రమాదం వుంది

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు బిజెపి శ్రేణుల ర్యాలీ ర్యాలీకి మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరయ్యారు. రాజా సింగ్ మాట్లాడుతూ ఏ విధంగా దుబ్బాక ప్రజలు గెలిపించి అసెంబ్లీ పంపారో పటాన్ చేరు ప్రజలు ఓటేసి పార్లమెంట్ కు పంపుతారని నమ్మకం వుంది. దేశ రక్షణ, ధర్మ రక్షణ కొరకు ఓటు వేసి పార్లమెంట్ పంపుతారు. హమారే బడే సాలేకు డర్ హోగా ఈ రోజు భారత్ లో ఎలాంటి ప్రధాని కావాలి. ఇక్కడ కాంగ్రెస్ గెలిచి దేశంలో కాంగ్రెస్ గెలిస్తే దేశమంతటా బాంబుల ధమాకా మోగుతుంది. పాకిస్తాన్ తో పంగ తీసుకుంటే అతని దగ్గర అణుబాంబులు వుంటే. మన దగ్గర లేవా అణు బాంబులు లేవా. చాలా చోట్ల మసీదుల్లో సమావేశాల్లో చర్చ జరుగుతుంది.. కాంగ్రెస్ ఓటు వెయ్యాలని. ముస్లిం లతో ఒక్కటే అడుగుతున్న ఎం తక్కువ చేశాం కాంగ్రెస్ వస్తే మళ్ళీ అయోధ్యలో మళ్ళీ బాబ్రీ పేరుతో తాళం వేస్తారు. హిందువుల సంఖ్య 8% శాతం తగ్గింది . ముస్లిం ల సంఖ్య 43% కు పెరిగింది. రోహంగ్యలు దాగి వున్నారు. ఎవరు ఎది చేసిన మూడో సారి మోడీని ప్రధాన మంత్రి కావడాన్ని ఎవరు ఆపలేరు. దేశంలో కొంతమంది నపుంసక నేతలు మోడీని తిడుతున్నారు. నాడు గుజరాత్ సింహం అన్నవారునేడు మోడీ ని తిడుతున్నారు. మెట్రో ను సంగారెడ్డి వరకు పొడిగింపు కొరకు బిజెపిని గెలిపించాలన్నారు

# సైబర్ బాధితుల్లో అక్షరాస్యులే ఎక్కువ

హైదరాబాద్: రోజు రోజుకి పెరిగిపోతున్న సైబర్ నేరాల్లో అధిక సంఖ్యలో చదువుకున్న వ్యక్తులే బాధితులుగా ఉంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి వస్తున్న కాల్స్ ను బట్టి వారి క్వాలిఫికేషన్లను నమోదు చేశారు పోలీసులు. వీరిలో ఎక్కువ సంఖ్యలో గ్రాడ్యుయేట్లే బాధితులుగా ఉన్నట్లు తెలిసింది. చదువుకున్న వ్యక్తులను టార్గెట్ చేస్తున్న సైబర్ ముఠాలు యధేచ్ఛగా వారికి తెలియకుండానే వారి మొబైల్ ఫోన్లో నుండి డబ్బులు కాజేస్తున్నారు. గడచిన ఆరు నెలల వ్యవధి డేటాను పరిశీలిస్తే సైబర్ బారిన పడిన వారిలో సుమారు 38,000 మంది గ్రాడ్యుయేట్లు బాధితులుగా ఉన్నారు. వీరిలో నిరక్షరాశులు కేవలం 800 మంది మాత్రమే బాధితులుగా ఉన్నారు. నిరంతరం సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్న బాధితుల సంఖ్య ప్రతిరోజు పెరుగుతూనే ఉంది. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని సైబర్ కంట్రోల్ రూమ్ కు 1930 ద్వారా రోజుకు సుమారు 250 కాల్స్ వస్తున్నాయి.. వీరిలో ప్రైవేట్ ఉద్యోగులే అధిక సంఖ్యలో మోసపోతున్నారు. అన్ని తెలిసి కొన్ని చిన్న పొరపాట్ల వల్ల సంబంధంలేని లింకులు క్లిక్ చేస్తూ మోసపోతున్నారు. ఆరు నెలల వ్యవధిలో సుమారు 30 వేలకు పైగా ప్రైవేటు ఉద్యోగులు తెలంగాణలో సైబర్ నేరగాళ్ల బారినపడి తమ డబ్బులు పోగొట్టుకున్నారు.స్మార్ట్ ఫోన్లు వాడకం ఎక్కువగా ప్రైవేట్ ఉద్యోగులు యువతనే చేస్తుండటంతో వీరినే టార్గెట్ చేసుకున్న సైబర్ ముఠాలు యధేచ్ఛగా తమ టార్గెట్ను రీచ్ అవుతున్నారు. వృద్ధులు లేదా రైతులు తక్కువ సంఖ్యలో స్మార్ట్ఫోన్లను వాడుతారు కాబట్టి వారు సైబర్ నేరగాల చేతిలో తక్కువగా మోసపోతున్నారు. ఇక తెలంగాణ వ్యాప్తంగా ఎక్కువ సైబర్ మోసాలు జరుగుతున్న కమిషనరేట్లను పరిశీలిస్తే, మొదటి స్థానంలో ఉంది ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉన్న సైబరాబాద్ ప్రాంతం . ఇక్కడ లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తుంటారు. సైబర్ మూసాలపై నిరంతర అవగాహన వీరికి ఉన్నప్పటికీ తెలిసి తెలియక చేస్తున్న చిన్న పొరపాటు వల్ల బాధ్యతులుగా మారిపోతున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుండి వచ్చిన ఫిర్యాదుల సంఖ్య 30 వేలకు పైబడి ఉంది. రెండో స్థానంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఉంది. హైదరాబాద్ కమిషనరేట్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న 24 వేల మంది సైబర్ నేరగాళ్ల బారిన పడ్డారు.

# కాళేశ్వరం.. విచారణ ముమ్మరం

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో మూడు పిల్లర్ల కుంగుబాటు, నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగం ఆరోపణలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ కొనసాగుతోంది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ సారథ్యంలో ఎంక్వైరీ కమిషన్ దర్యాప్తు వేగవంతం చేసింది. ఇటీవలే బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించింది. బ్యారేజీలను పరిశీలించి సాంకేతిక అంశాలనూ సేకరించింది. ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికతో పాటు క్షేత్రస్థాయి పర్యటనలో తెలుసుకున్న అంశాలు, ప్రజాభిప్రాయ సేకరణలో తమ దృష్టికి వచ్చిన విషయాలు, కాగ్, విజిలెన్స్, సాండ్ రిపోర్టులపై పీసీ ఘోష్ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. గురువారం బీఆర్కే భవన్లో ఇరిగేషన్ అధికారులు, ఈఎన్సీలు నాగేందర్, అనిల్ కుమార్లతో భేటీ అయ్యారు. దర్యాప్తును ముమ్మరం చేసి జూన్ 30వ తేదీలోగా రిపోర్టును ప్రభుత్వానికి అందించాలని కమిషన్ భావిస్తున్నది.పీసీ ఘోష్ కమిషన్ విజ్ఞప్తి మేరకు ఎన్డీఎస్ఏ మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి అందించింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కూడా పిల్లర్ల కుంగుబాటుకు కారణం అని ఆ నివేదికలో ఎన్డీఎస్ఏ పేర్కొన్నట్టు తెలిసింది. 2019 జూన్లో కాళేశ్వరం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిందని, నవంబర్లోనే బ్యారేజీలో పలు లోపాలు బయటపడ్డాయని పొందుపరించింది. ఏడవ బ్లాకులో 19 నుంచి 22 వరకు కుంగిన పిల్లర్లను మరమ్మతు చేసినా పూర్తి స్థాయిలో గ్యారెంటీ ఇవ్వలేమనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచినట్టు సమాచారం. మిగిలిన పిల్లర్లకు సంబంధించి మరింత అధ్యయనం చేయాలని నివేదికలో సూచించింది. అలాగే, తాత్కాలిక మరమ్మతులు చేయాలనే ప్రస్తావననూ ఎన్డీఎస్ఏ తెచ్చినట్టు తెలిసింది. ఈ అంశంపై పీసీ ఘోష్ కమిషన్ సీరియస్గా చర్చిస్తున్నట్టు సమాచారం.పీసీ ఘోష్ కమిషన్ కూడా వరుస సమావేశాలు నిర్వహించనుంది. ఎన్డీఎస్ఏ, విజిలెన్స్, కాగ్, సాండ్ రిపోర్టులపై కూలంకషంగా చర్చించనుంది. ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత వివరాలన్నీ క్రోడీకరించి ఎవరికి నోటీసులు ఇవ్వాలనే అంశాన్ని కమిషన్ పరిశీలించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైందన్న ఆరోపణలు రావడంతో దానిపైనా కమిషన్ ఎంక్వైరీ చేయనుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు టెండర్ మొదలై 2019 జూన్ పూర్తయ్యే నాటికి జరిగిన పరిణామాలను పరిశీలించి అవసరమైన వారిని పిలిచి పీసీ ఘోష్ కమిషన్ విచారించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో 32 డిపార్ట్మెంట్లు, పలు ఏజెన్సీలు ఉన్నాయి. వీటితోపాటు గత ప్రభుత్వంలోని పెద్దలను కూడా పిలిచి విచారించే చాన్స్ ఉన్నది.

# టోల్ గేట్ల వద్ద భారీ క్యూ...

## సొంతూళ్లకు నగర జనం



హైదరాబాద్,: ఏపీలో ఓట్ల పండుగ మొదలు కానుంది. ఎన్నికల వేళ అక్కడ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్ (ఊఎటవతీజీఎజీట)లో స్థిరపడిన ఓటర్లు భారీగా తరలివెళ్తున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం ఇక్కడ ఉండి ఐదేళ్లకోసారి తమకు ఇష్టమైన నాయకున్ని ఎన్నుకునేందుకు ఉత్సాహంగా సొంతూళ్లకు కదులుతున్నారు. ఈ క్రమంలో చాలామంది ఓటర్లు ప్రత్యేక బస్సులు, రైళ్లలో ఊర్లకు చేరుకుంటుండగా.. ఇంకొందరు తమ సొంత వాహనాల్లోనే స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో హైదరాబాద్ – విజయవాడ హైవేపై రద్దీ నెలకొంది.

వారాంతం, వరుస సెలవులు, పోలింగ్ కు ఇంకా రెండు రోజులే టైం ఉండడంతో శనివారం వేకువజాము నుంచే జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం నెలకొంది. ఈ వాహనాలు విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం, విశాఖ వైపు తరలివెళ్తున్నాయి. జాతీయ రహదారిపై రద్దీ నేపథ్యంలో నెమ్మదిగా కదులుతున్నాయి. మరోవైపు, హైదరాబాద్ శివారు హయత్ నగర్ నుంచి అబ్దుల్లాపూర్ మెంట్ వరకూ ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోంది. అటు, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. మరోవైపు, హైదరాబాద్ నుంచి ఓటు వేసేందుకు వెళ్లే వారి కోసం టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు కేటాయించింది. అటు, దక్షిణ మధ్య రైల్వే సైతం ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రమే పలువురు ప్రత్యేక బస్సులు, రైళ్లలో తమ సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో బస్టాండ్స్, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. కాగా, పది రోజుల ముందే బస్సుల్లో సీట్లన్నీ ఫుల్ అయ్యాయి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీఎస్ఆర్టీసీ 2 వేల ప్రత్యేక బస్సులు కేటాయించింది. ఎంజీబీఎస్ నుంచి 500, జేబీఎస్ నుంచి 200, ఉప్పల్ నుంచి 300, ఎల్బీనగర్ నుంచి 300 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే, ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ఎన్నికల టైంను క్యాష్ చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఏపీలోని ప్రధాన నగరాలకు రూ.500 నుంచి రూ.1000 వరకూ టికెట్ ఛార్జీలుండగా.. ప్రస్తుతం రూ.5 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడ వరకూ టికెట్ రేట్లు రూ.2,500 వరకూ చూపిస్తున్నాయని పేర్కొంటున్నారు. అలాగే, హైదరాబాద్ నుంచి విశాఖ, రాజమండ్రి, కడప, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు సైతం అదే రేంజ్ లో రేట్లు చూపిస్తున్నాయని చెబుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు, విమానాశ్రయాల్లోనూ ప్రయాణీకుల రద్దీ నెలకొంది. గన్నవరం విమానాశ్రయం శుక్రవారం సాయంత్రం నుంచి రద్దీగా మారింది. ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఓటర్లు ఇక్కడ దిగుతున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి నగరాల్లో స్థిరపడ్డ వారు సైతం ఓటేసేందుకు తమ సొంతూళ్లకు వస్తుండడంతో ఎయిర్ పోర్టులు, బస్టాండ్స్, రైల్వే స్టేషన్లలో భారీగా రద్దీ నెలకొంది. దీంతో ఈసారి ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని అంతా భావిస్తున్నారు.

# పట్టభద్రులు..ఎవరికి పట్టం కట్టేనో...?

వరంగల్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై మూడు ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా, ఈసారి అధికార పార్టీ నుంచి బరిలో నిలిచిన తీన్మార్ మల్లన్న ఇప్పటికే ప్రచారాలు మొదలుపెట్టారు. జిల్లాల వారీగా టెలీ కాన్ఫరెన్సులు నిర్వహిస్తూ గ్రాడ్యుయేట్ల ఓపీనియన్స్ తెలుసుకుంటున్నారు. వారితో ఇంటరాక్ట్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు.ఇక బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి కూడా తనవంతుగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయనకు కొంత పట్టు ఉండగా.. ఎక్కువ ఓటర్లున్న ఖమ్మం, నల్గొండ జిల్లాలపై ఫోకస్ పెట్టారు. ఇక బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి ఇంకా ప్రచారం మొదలు పెట్టలేదు.గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనైనా గెలిచి ఉనికిని చాటుకోవాలని బీఆర్ఎస్ భావిస్తుండగా.. బీజేపీలో కూడా అదే భావన వ్యక్తమవుతోంది. అధికార పార్టీ అయిన కాంగ్రెస్ లో కొంత జోష్ కనిపిస్తుండగా.. పట్టభద్రులు ఎటువైపు మొగ్గుచూపుతారో చూడాలి.పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి బరిలో నిలవగా.. బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మరోసారి అధిష్ఠానం అవకాశం కల్పించింది.హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం దామెరకు చెందిన ఆయన 2021లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి.. జనగామ ఎమ్మెల్యేగా గెలిచి రాజీనామా చేయడంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కాగా.. ఉప ఎన్నికకు మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో గ్రాడ్యుయేట్ పోరు హోరాహోరీగా సాగనుంది.ఇప్పటికే కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి నామినేషన్ వేయగా.. గురువారం బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు.వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 2021 మార్చిలో ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు, ఇండిపెండెంట్లు అందరూ కలిపి మొత్తంగా 76 మంది బరిలో నిలిచారు.మొత్తంగా 5,05,565 మంది ఓట్లు ఉండగా.. అందులో 3,87,969 ఓట్లు పోలయ్యాయి. వివిధ కారణాలతో 21,636 ఓట్లు చెల్లకుండా పోయాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్ రెడ్డి పోటీ చేయగా.. కాంగ్రెస్ నుంచి రాములు నాయక్, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పోటీ చేశారు. పోటీ మాత్రం అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డికి, ఇండిపెండెంట్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మధ్యే జరిగింది.ఆ ఎన్నికల్లో ఓవరాల్ గా పల్లా రాజేశ్వర్ రెడ్డికి 1,61,811 ఓట్లు రాగా.. తీన్మార్ మల్లన్నకు 1,49,005 ఓట్లు పోలయ్యాయి. దీంతో 12,806 ఓట్ల తేడాతో పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించి, రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. తెలంగాణ జనసమితి నుంచి బరిలో నిలిచిన ఆ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం 71,126 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు.బీజేపీ నుంచి పోటీ చేసిన ప్రేమేందర్ రెడ్డికి 39,306, కాంగ్రెస్ పార్టీకి చెందిన రాములు నాయక్ కు 27,729 ఓట్లు మాత్రమే వచ్చాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులను వెనక్కి నెట్టి తీన్మార్ మల్లన్న బీఆర్ఎస్ అభ్యర్థికి గట్టి పోటీనివ్వగా.. తుది ఫలితాల వరకు ఉత్కంఠ కొనసాగింది. చివరకు ఎమ్మెల్సీగా పల్లా గెలవగా.. రెండో స్థానంలో తీన్మార్ మల్లన్న నిలిచారు.

**12 జిల్లాలు.. 4.61 లక్షల ఓటర్లు**

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలోని 12 జిల్లాల పరిధిలో గత ఎన్నికల్లో 5 లక్షలకు పైగా ఓటర్లు నమోదు కాగా.. ఈ సారి మొత్తంగా 4,61,806 మంది ఓటర్లున్నట్లు అధికారులు ప్రకటించారు. వీరిలో 2,87,007 మంది పురుషులు కాగా.. 1,74,794 మంది మహిళలు, ఇతరులు ఐదుగురున్నారు.మొత్తంగా 600 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఈ ఎన్నికల్లో నల్గొండ జిల్లాలో 80,559 మంది, సూర్యాపేటలో 51,293, భువనగిరిలో 33,926, ఖమ్మంలో 83,606, భద్రాద్రికొత్తగూడెంలో 39,898, భూపాలపల్లిలో 12,460, ములుగు 10,237, మహబూబాబాద్ 34,759, వరంగల్ 43,594, హనుమకొండ 43,483, జనగామ 23,320, సిద్దిపేటలో 4,671 మంది ఓటర్లు నమోదై ఉన్నారు.

# టీటీడీపీ చూపు..ఎటూ వైపు..?

ఖమ్మం, హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న లోక్సభ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తల ఓట్లు ఈసారి ఎవరికి దక్కనున్నాయనే చర్చ ప్రస్తుతం జరుగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని సీమాంధ్ర ఓటర్లలోని ఈ రెండు పార్టీల ఓటర్లు గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రధాన నేతగా ఉన్న కాంగ్రెస్ పార్టీకే మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. అయితే, ఈసారి తెలంగాణ ఎంపీ ఎన్నికల బరి నుంచి ఈ రెండు పార్టీలు తప్పుకున్నాయి. కాగా, ఈ లోక్సభ ఎన్నికల్లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ మద్దతు బీజేపీకేనని బుధవారం టీటీడీపీ ప్రకటించింది. బీజేపీ నేత మాజీఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి టీటీడీపీ నేతలతో చర్చల అనంతరం.. తమ పార్టీ ఈ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి మద్ధతు ఇవ్వనుందని, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నిర్ణయం మేరకే దీనిని ప్రకటిస్తున్నామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, సానుభూతి పరులు ఎలాంటి బేషజాలకు పోకుండా.. బీజేపీకి ఓటు వేయాలని రెండు పార్టీలు కోరాయి. అయితే, ఈ ప్రకటనతో బీజేపీకి ఒరిగేదేమీ లేదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.రాష్ట్రంలోని పలు జిల్లాలు, పలు పార్లమెంట్స్థానాల్లో టీడీపీకి ఇంకా కేడర్ ఉంది. ఉమ్మడి రంగారెడ్డి, ఖమ్మం, నల్గొండ, మహబూబ్నగర్ జిల్లాల్లో పార్టీకి ఇప్పటికీ కొంత పట్టుంది. మల్కాజిగిరి, చేవెళ్ల, భువనగిరి, నల్గొండ, ఖమ్మం, మహబూబాబాద్ సెగ్మెంట్లలో నేటికీ ఆ పార్టీకి కనీస స్థాయి క్యాడర్ ఉండగా, ఖమ్మం, మల్కాజిగిరి సీట్లలో గెలుపోటములను డిసైడ్ చేసే స్థాయిలో నేటికీ టీడీపీకి బలం ఉంది. ఇక.. భువనగిరి స్థానం పరిధిలోని మునుగోడు, ఇబ్రహీంపట్నం.. నల్గొండ పార్లమెంట్ పరిధిలో కోదాడ, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో భద్రాచలం, పినపాక, ఇల్లందు నియోజకవర్గాల్లో టీడీపీకి పట్టుంది. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకపోవటంతో ఆ పార్టీ బలం వేగంగా తగ్గినా.. ఉనికి మాత్రం నిలిచే ఉంది.తెలంగాణలో నివసిస్తున్న చాల మంది సీమాంధ్రులకు తెలంగాణతో బాటు ఏపీలోనూ ఓట్లు న్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలలో వారిలో చాలామంది ఇక్కడ తమ ఓటును కాంగ్రెస్కు, కొన్ని వర్గాలు బీఆర్ఎస్కు ఓటు వేశాయి. అయితే, ఈసారి అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగటంతో వీరిలో చాలామంది అక్కడికి వెళ్లి ఓటు వేయటానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్లో టీడీపీ, జనసేనలు అక్కడి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా బీజేపీతో పొత్తు పెట్టుకున్నా, బీజేపీతో పొత్తు టీడీపీ, జనసేన కార్యకర్తలు, నేతలకు ఎవరికీ ఇష్టంగా లేదు. అమరావతిని ధ్వంసం చేస్తుంటే మోదీ చూస్తూ ఉండిపోవటం, చంద్రబాబు అరెస్టు, పవన్ కల్యాణ్, జనసేన కార్యకర్తలు,నేతలను అక్కడి ప్రభుత్వం నానా ఇబ్బందులు పెట్టిన సందర్భంలోనూ ప్రధాని మోదీ ఏనాడూ నోరెత్తి మాట్లాడలేదు. 2017 తర్వాత చంద్రబాబు నాయుడి ప్రభుత్వాన్ని నిధుల విషయంలో, పాలనా పరమైన విషయాల్లో నానా తిప్పలు పెట్టిన కేంద్రంలోని బీజేపీ, గడిచిన ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వానికి పెద్దన్నలా వ్యవహరించి, ఆదుకుందనే కోపం కూడా సీమాంధ్ర ఓటర్లలో మెజారిటీ వర్గాలకు ఉంది. జగన్తో కలిసి పొత్తుపెట్టుకుని ఎన్నికలకు వెళితే ఓటమి ఖాయమని తెలిసి, తప్పనిసరి పరిస్థితిలోనే బీజేపీ..టీడీపీ, జనసేన పొత్తులో భాగస్వామి అయిందని వారు భావిస్తున్నారు.2014లో రాష్ట్ర విభజన జరిగినప్పటికీ, నేటికీ సీమాంధ్ర ప్రాంతం నుంచి తెలంగాణలో స్థిరపడిన సెటిలర్లకు.. నేటికీ తమ ప్రాంతంతో మానసిక బంధం ఇంకా బలంగానే ఉంది. రాజకీయంగా, సాంస్కృతికంగా వారు నేటికీ ఏపీలో జరిగే ప్రతి మార్పుకూ చురుగ్గా స్పందిస్తూనే ఉన్నారు. ఇక, ఇక్కడి టీడీపీ కార్యకర్తలు, నేతలు, అభిమానులు, సానుభూతిపరుల్లో ఇది మరింత ప్రబలంగా కనిపిస్తోంది. ఇందులో భాగంగానే చంద్రబాబు అరెస్టు సమయంలో వారు ఇక్కడ నిరసనలు తెలిపారు. ఈ అరెస్టుకు మోదీ మద్దతు కూడా ఉందని భావించి, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఓటేశారు.ఆ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని అన్ని సీట్లనూ బీఆర్ఎస్ గెలిచినప్పటికీ, సీమాంధ్రుల్లో టీడీపీ, జనసేన పార్టీల వారిలో మెజారిటీ వర్గం కాంగ్రెస్కు ఓటు వేశారనే వాస్తవాన్ని కొట్టిపారేయటం సాధ్యం కాదు. మరోవైపు.. ఖమ్మం జిల్లాలో టీడీపీ ఓట్లన్నీ కాంగ్రెస్కే పడినట్లు అక్కడి గణాంకాలే చెబుతున్నాయి.మరోవైపు తెలంగాణలోని సీమాంధ్ర టీడీపీ వర్గాల మనసులో రేవంత్ రెడ్డికి ప్రత్యేక స్థానం ఉందనేదీ బహిరంగ సత్యమే. గతంలో మల్కాజ్గిరి ఎంపీగా పోటీ చేసిన సమయంలో ఇది స్పష్టంగా రుజువైంది. రేవంత్ సీఎం అయినవేళ.. గాంధీభవన్ ర్యాలీలోనూ టీడీపీ జెండాలు రెపరెపలా డాయి.చంద్రబాబు అరెస్టుపై నిరసన తెలిపిన కార్యకర్తలపై కేటీఆర్ నోరుపారేసుకున్న వేళ.. వారు బహిరంగంగానే తాము ఎవరికి మద్దతు ఇవ్వబోతున్నామో చెప్పకనే చెప్పారు.సీమాంధ్ర ప్రాంత ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలోనూ వారి పట్ల తనకున్న ప్రేమను బహిరంగంగానే ముఖ్యమంత్రి హోదాలోనూ రేవంత్ రెడ్డి చాటుకుంటూ వస్తున్నారు. పైగా, గత అసెంబ్లీ ఎన్నికలలో ఉన్న అస్పష్టత కూడా ఇప్పుడు తెలంగాణలో లేదు గనుక ఈసారి వారంతా తప్పకహస్తానికే ఓటేస్తారనే అభిప్రాయంబలంగా వ్యక్తమవు తోంది.

# హామీలు మర్చిన కాంగ్రెస్కు ఓటుతో బుద్ధి చెప్పాలని చూస్తున్న ప్రజలు

## –మంథనిలో ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

మంథని: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలును మరచిన కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలనే ఆలోచనతో ప్రజలు ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం మంథని ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులో ఆయన తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పటి వరకు పథకాలనుపక్కన పడేశారని అన్నారు. పార్లమెంట్ఎన్నికల్లో ఓట్ల కోసం మళ్లీ పథకాల ఆశ చూపిన కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్తేనే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తారనే ఉద్దేశ్యంతో ప్రజలు ఓటింగ్లో పాల్గొంటున్నారని ఆయన అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎంగా కేసీఆర్ నాయకత్వంలో జరిగిన సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజలు చూశారని, అదే విధంగా కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఐదు మాసాల్లో ఎలా పథకాలు కనుమరుగైపోతున్నాయో చూశారన్నారు. కేంద్రంలో ప్రశ్నించే గొంతు ఉండాలంటే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికే అవకాశం ఇవ్వాలని ప్రజలు ఆలోచన చేస్తున్నట్లు ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# డేంజర్ జోన్ లో సన్ రైజర్స్..

ఐపీఎల్ 2024 సీజన్ తుది దశకు చేరింది. 62 మ్యాచ్‌లు ముగిసే సరికి ప్లే ఆఫ్స్ సమరం రసవత్తరంగా మారింది. ఇప్పటి వరకు కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) మినహా మరే జట్టు అధికారికంగా ప్లే ఆఫ్స్‌కు అర్హతసాధించలేదు. రాజస్థాన్ రాయల్స్ అడుగు దూరంలో నిలవగా.. సీఎస్‌కే, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆర్‌సీబీ, లక్నో సూపర్ జెయింట్స్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఆదివారం జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌ల్లో రాజస్థాన్ రాయల్స్‌పై సీఎస్‌కే, ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఆర్‌సీబీ విజయాలు సాధించి తమ ప్లే ఆఫ్స్ అవకాశాలను మెరుగుపరుచుకున్నాయి. 62 మ్యాచ్‌లు ముగిసే సరికి కేకేఆర్ టేబుల్ టాపర్‌గా నిలవగా.. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా టాప్-4లో కొనసాగుతున్నాయి. ఆర్‌సీబీ, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇప్పటికే ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించాయి.

**ఆర్‌సీబీ ప్లే ఆఫ్స్ చేరాలంటే..**

0.387 రన్‌రేట్‌తో ఆర్‌సీబీ ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌ను బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఆర్‌సీబీ 18 ప్లస్ రన్స్ తేడాతో ఓడించాలి. లేదా 18.1 ఓవర్లలోనే సీఎస్‌కే విధించిన లక్ష్యాన్ని చేధించాలి.

అప్పుడే సీఎస్‌కే కంటే మెరుగైన రన్‌రేట్ సాధించి ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తోంది. అంతేకాకుండా సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో కనీసం ఒక్క మ్యాచ్ అయినా ఓడాలి. లక్నో తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిచి, సన్‌రైజర్స్ ఒక మ్యాచ్ గెలిస్తే చెన్నై చేతిలో టాస్ ఓడినా.. ఆర్‌సీబీ ప్లే ఆఫ్స్ రేసు



నుంచి తప్పుకుంటుంది. చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ఓడితే ఎలాంటి సమీకరణతో సంబంధం లేకుండా ఆర్‌సీబీ ఇంటిదారిపడుతోంది.

**సీఎస్‌కే ప్లే ఆఫ్స్ చేరాలంటే..**

ఆర్‌సీబీతో జరిగే చివరి మ్యాచ్‌లో విజయం సాధిస్తే చెన్నై సూపర్ కింగ్స్ 16 పాయింట్స్‌తో ప్లే ఆఫ్స్ బెర్త్ దక్కించుకుంటుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించినా.. ఆర్‌సీబీ మెరుగైన రన్‌రేట్‌తో గెలిచినా చెన్నై నిష్క్రమిస్తోంది.

**డేంజర్ జోన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్..**

14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో కనీసం ఒక్క మ్యాచ్ అయినా మెరుగైన రన్‌రేట్‌తో గెలవడం కీలకం. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఓడితే మాత్రం సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకుంటుంది. సన్‌రైజర్స్ తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ ఓడి.. లక్నో సూపర్ జెయింట్స్ ఒక్క మ్యాచ్‌లో ఓడినా ఆర్‌సీబీ, సీఎస్‌కే ప్లే ఆఫ్స్ చేరుతాయి.

# చెన్నై సేఫ్

**కీలక మ్యాచ్‌లో రాజస్థాన్‌పై గెలుపు**

**సిమర్‌జిత్ సూపర్ బౌలింగ్ రుతురాజ్ కెప్టెన్ ఇన్నింగ్స్**

**ఈ సీజన్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)..**



ప్లేఆఫ్స్ చేరాలంటే తప్పక రాణించాల్సిన మ్యాచ్‌లో జూలు విదిల్చింది. తమ సొంత డెన్ చెపాక్‌లో సిమర్‌జిత్ సూపర్ బౌలింగ్‌తో రాజస్థాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడిచేసిన రుతురాజ్ సేన.. ఆ తర్వాత స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తడబడ్డా చివరికి గమ్యాన్ని ముద్దాడింది. ఈ గెలుపుతో చెన్నై.. ఏడు విజయాలతో 14 పాయింట్లు సాధించి పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి దూసుకెళ్లింది.

చెన్నై: ఐపీఎల్-17లో ఒడిదొడుకుల మధ్య సాగుతున్న డిఫెండింగ్ చాంపియన్ సూపర్ కింగ్స్.. ప్లేఆఫ్స్ రేసులో నిలిచేందుకు రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన అత్యంత కీలకమ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో అదరగొట్టింది. చెపాక్ వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో రాజస్థాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి ప్లేఆఫ్స్ బెర్తును పదిలం చేసుకుంది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' సిమర్‌జిత్ సింగ్ (3/26) ధాటికి రాజస్థాన్ టాపార్డర్ కుప్పకూలడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 141 పరుగులకే పరిమితమైంది. రియాన్ పరాగ్ (35 బంతుల్లో 47 నాటౌట్, 1 ఫోర్, 3 సిక్సర్లు) రాణించాడు. స్వల్ప ఛేదనే అయినా చెన్నై కూడా ఛేదనలో తడబాటుకు లోనైంది. రుతురాజ్ గైక్వాడ్ (41 బంతుల్లో 42 నాటౌట్, 1 ఫోర్, 2 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆ జట్టు 18.2 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తిచేసింది.

**సిమర్‌జిత్ సూపర్..**

చెపాక్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ ఇన్నింగ్స్‌ను నెమ్మదిగానే ఆరంభించింది. ప్రమాదకర బట్లర్ (21), జైస్వాల్ (24) క్రీజులో ఉన్నా పవర్ ప్లేలో ఆ జట్టు 42 పరుగులే చేయగలిగింది. ఏడో ఓవర్లో బంతిని అందుకున్న సిమర్‌జిత్.. రెండో బంతికే జైస్వాల్‌ను ఔట్ చేసి చెన్నైకి బ్రేక్ ఇచ్చాడు. తన రెండో ఓవర్లో బట్లర్‌ను బోల్తా కొట్టించిన సిమర్‌జిత్.. 15వ ఓవర్లో శాంసన్ (15) ను పెవిలియన్‌కు పంపాడు. మిడిల్ ఓవర్స్‌లో రాజస్థాన్ బ్యాటర్లు పరుగులు తీయడానికి నానా తంటాలు పడ్డారు. తీక్షణ, జడేజా, శార్దూల్ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడిచేశారు. చివర్లో పరాగ్, ధ్రువ్ జురెల్ (18 బంతుల్లో 28, 1 ఫోర్, 2 సిక్సర్లు) మెరుపులతో రాజస్థాన్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది.

**చెన్నై కష్టంగానే..**

స్వల్ప ఛేదనను పూర్తిచేయడానికి చెన్నై కూడా తంటాలు పడింది. ఆరంభంలో రచిన్ రవీంద్ర (18 బంతుల్లో 27, 1 ఫోర్, 2 సిక్సర్లు) దూకుడుగా ఆడినా అశ్విన్ వేసిన 3వ ఓవర్లో అతడికే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మిచెల్ ఉన్నది కొద్దిసేపే అయినా బౌండరీలతో మెరుపులు మెరిపించి చాహల్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. ఆ తర్వాత నుంచి సీఎస్‌కే స్కోరు వేగం మందగించింది. మొయిన్ అలీ (10)తో పాటు రుతురాజ్ కూడా పరుగులు తీయడానికి ఇబ్బందిపడ్డారు. అశ్విన్ వేసిన 14వ ఓవర్లో 6, 4, 4 బాదిన దూబే (18) అదే ఓవర్లో ఆఖరి బంతికి రియాన్ పరాగ్ చేతికి చిక్కాడు. జడేజా (5) అబ్‌స్ట్రక్టింగ్ ది ఫీల్డ్ రూపంలో పెవిలియన్ చేరడంతో చెన్నై శిబిరంలో ఒకింత అలజడి రేగింది. కానీ రుతురాజ్ అండతో రిజ్వీ (8 బంతుల్లో 15 నాటౌట్, 3 ఫోర్లు) లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**సంక్షిప్త స్కోర్లు**

రాజస్థాన్: 20 ఓవర్లలో 141/5 (రియాన్ 47, జురెల్ 28, సిమర్‌జిత్ 3/26, తుషార్ 2/30). చెన్నై: 18.2 ఓవర్లలో 145/5 (రుతురాజ్ 42 నాటౌట్, రచిన్ 27, అశ్విన్ 2/35, బర్గర్ 1/21)

# ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ చేరాలంటే ఏం చేయాలి?

## ఏమేం జరగాలి... లక్నో పరిస్థితి ఏంటి..

2011లో వరుసగా 7 మ్యాచుల్లో గెలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, 2009లో, 2016లో వరుసగా ఐదేసి మ్యాచుల్లో గెలిచింది. ఈ మూడు సందర్భాల్లోనూ ఫైనల్ చేరింది ఆర్‌సీబీ. ఆ తర్వాత ఆర్‌సీబీ వరుసగా 5 మ్యాచులు గెలవడం ఇదే తొలిసారి.. అయితే ఈసారి ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ చేరాలంటే ఏం చేయాలి? ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో 47 పరుగుల తేడాతో విజయం దక్కడంతో ఆర్‌సీబీ నెట్ రన్ రేట్, మైనస్ నుంచి పాజిటివ్‌లోకి వచ్చింది. ఇది ఆర్‌సీబీ ప్లేఆఫ్స్ ఛాన్సులను బాగా పెంచింది. ఆఖరి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై ఆర్‌సీబీ కనీసం 18 పరుగుల తేడాతో గెలిస్తే, ఆర్‌సీబీ, చెన్నై సూపర్ కింగ్స్‌ని వెనక్కి నెట్టగలుగుతుంది. ఒకవేళ ఛేజింగ్ చేయాల్సి వస్తే, చెన్నై ఎంత లక్ష్యం విధించినా దాన్ని 17 ఓవర్లలోనే ఛేదించాల్సి ఉంటుంది.. ఆఖరి మ్యాచ్‌లో చెన్నైపై గెలిచినా ఆర్‌సీబీకి లైన్ క్లియర్ కాదు... లక్నో సూపర్ జెయింట్స్ కూడా 12 మ్యాచుల్లో 6 విజయాలు అందుకుంది. కాబట్టి లక్నోకి ఇంకా 2 మ్యాచులు ఉన్నాయి. ఈ రెండు మ్యాచుల్లో లక్నో సూపర్ జెయింట్స్ గెలిస్తే 16 పాయింట్లకు చేరుకుంటుంది. అప్పుడు ఆర్‌సీబీకి కానీ, చెన్నై సూపర్ కింగ్స్‌కి కానీ, ఢిల్లీ క్యాపిటల్స్‌కి కానీ అవకాశం ఉండదు..

ఎందుకంటే 9 విజయాలు అందుకున్న కేకేఆర్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కి అర్హత సాధించింది. 16 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ రాయల్స్, తర్వాతి మ్యాచుల్లో పంజాబ్ కింగ్స్, కేకేఆర్‌లతో ఆడనుంది.



ఈ రెండింట్లో ఏ మ్యాచ్ గెలిచినా రాజస్థాన్ కూడా ప్లేఆఫ్స్ చేరుతుంది. ఈ రెండింట్లో ఓడినా రాజస్థాన్‌కి వచ్చిన నష్టమేమీ లేదు..

మూడో స్థానంలో ఉన్న చెన్నైకి ఆర్‌సీబీతో ఆఖరి మ్యాచ్ ఒక్కటే ఉంది. నాలుగో స్థానంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 మ్యాచుల్లో 7 విజయాలు అందుకుంది. ఆఖరి 2 మ్యాచుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్, పంజాబ్ కింగ్స్‌తో ఆడుతోంది. ఈ రెండింట్లో ఒక్కటి గెలిచినా సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్ బెర్త్ కన్ఫార్మ్ అవుతుంది..

**గుజరాత్ కష్టమే...**

టాప్ 8లో ఉన్న గుజరాత్ టైటాన్స్ 12 మ్యాచుల్లో 5 విజయాలు అందుకుంది. కాకపోతే ఆ టీమ్ నెట్ రన్ రేట్ -1.063గా ఉంది. చివరి రెండు మ్యాచుల్లో కేకేఆర్, సన్‌రైజర్స్‌పై గుజరాత్ టైటాన్స్ భారీ తేడాతో గెలిస్తేనే గుజరాత్ టైటాన్స్‌కి ఛాన్స్ ఉంటుంది..

**లక్నోతోనే అసలు చిక్కు..**

ఎటొచ్చీ పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో ఉన్న లక్నో సూపర్ జెయింట్స్‌తోనే అటు ఆర్‌సీబీకి, ఇటు సీఎస్‌కేకి చిట్కు. మే 14న ఢిల్లీ క్యాపిటల్స్‌తో, మే 17న ముంబై ఇండియన్స్‌తో మ్యాచులు ఆడుతోంది లక్నో సూపర్ జెయింట్స్.. ఈ రెండింట్లో గెలిస్తే.. టాప్ 4 కన్ఫార్మ్.. ఒక్క మ్యాచ్ గెలిచి, ఒకటి ఓడిపోతే.. మళ్లీ నెట్ రన్ రేట్ లెక్కల ఆధారంగా ప్లేఆఫ్స్ టీమ్ డిసైడ్ అవుతుంది..

# సింహంతో పరాచకాలా..! మనకెందుకు ఇషాంత్..! చూడు ఇప్పుడు ఏమైందో..?




మిణుకుమిణుకు మంటున్న ప్లే ఆఫ్స్ ఆశలను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు సజీవంగా ఉంచుకుంది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 47 పరుగుల తేడాతో గెలుపొందింది.

దీంతో పాయింట్ల పట్టికలో ఆర్‌సీబీ ఐదో స్థానానికి ఎగబాకింది. ఈ మ్యాచ్‌లో ఇషాంత్ శర్మ, విరాట్ కోహ్లిల మధ్య ఓ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ మ్యాచ్‌లో బెంగళూరు జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 187 పరుగులు చేసింది. ఓపెనర్ విరాట్ కోహ్లి 13 బంతులు ఎదుర్కొన్నాడు. 1 ఫోర్, 3 సిక్సర్లు బాది 27 పరుగులు చేశాడు. కాగా.. ఆర్‌సీబీ ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో కోహ్లి-ఇషాంత్‌కు మధ్య చిన్నపాటి టీజింగ్ జరిగింది. నాలుగో ఓవర్ ను ఇషాంత్ శర్మ వేశాడు. ఈ ఓవర్‌లోని మొదటి బంతికి విరాట్ కోహ్లి ఫోర్ కొట్టాడు. ఆ తరువాత ఇషాంత్‌తో స్లిప్‌లో ఫీల్డర్ పెట్టూ ఆటపట్టించాడు. ఆ తరువాతి బంతిని సిక్స్ బాదాడు. మరోసారి కోహ్లి ఏదో అనగా ఇషాంత్ కామ్‌గానే ఉన్నాడు. మూడో బంతి మిస్ కాగా.. నాలుగో బంతిని భారీ షాట్ ఆడేందుకు యత్నించగా బ్యాట్ ఎడ్జ్‌ను తీసుకున్న బంతి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. దీంతో కోహ్లి ఔట్ అయ్యాడు. తన వంతు రావడంతో ఇషాంత్ ఆనందంతో ఎగిరి గంతులేశాడు. ఆ తరువాత కోహ్లి వద్దకు వచ్చి నడుముతో అతడిని వెనక్కి నెడుతూ వెళ్లు ఇక వెళ్లు అన్నట్లుగా సింబాలిక్‌గా చెప్పగా.. కోహ్లి నవ్వుతూ మైదానాన్ని వీడాడు.

అనంతరం లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ 19.1 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. కాగా.. ఢిల్లీ ఇన్నింగ్స్‌లో పదో నంబర్ స్థానంలో ఇషాంత్ శర్మ బ్యాటింగ్‌కు వచ్చాడు. ఆ సమయంలో అతడి వద్దకు వెళ్లిన కోహ్లి.. ఇక చాల్లే పద పద అంటూ ఆటపట్టించాడు. ఇషాంత్ నాలుగు బంతులు ఎదుర్కొని పరుగులు ఏమీ చేయకుండా అజేయంగా ఉన్నాడు. కాగా.. ఇషాంత్, కోహ్లిలకు సంబంధించిన టీజింగ్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

విరాట్ కోహ్లి, ఇషాంత్ శర్మలు దేశవాళీ క్రికెట్‌లో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించారు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య మంచి స్నేహం ఉంది. టీమ్ఇండియాలో కోహ్లి కెప్టెన్సీలో ఇషాంత్ ఆడాడు. ఈ క్రమంలోనే ఇలా ఒకరినొకరు సరదాగా టీజ్ చేసుకున్నారు.

# బెంగళూరు ప్లే ఆఫ్ చేరాలంటే చెన్నైపై గెలవాల్సిన మార్జిన్ ఇదే.. ఆర్‌సీబీ లక్ మారేనా?



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ ఇప్పటివరకు 13 మ్యాచ్‌లు ఆడాయి. ఈ మ్యాచ్‌ల్లో సీఎస్‌కే 7 గెలవగా, ఆర్‌సీబీ 6 గెలిచింది. ఇప్పుడు లీగ్ దశలో ఇరు జట్లు తమ చివరి మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ప్లేఆఫ్‌కు చేరుకోవచ్చు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో 62 మ్యాచ్‌లు ముగిశాయి. ఈ మ్యాచ్‌లు ముగిసే సమయానికి చెన్నై సూపర్ కింగ్స్ జట్టు పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరుకుంది. అలాగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు 5వ స్థానంలో ఉంది. ప్లేఆఫ్‌కు చేరుకోవడానికి %జూఖ% జట్టుకు కేవలం ఒక మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. ఆర్సీబీపై కూడా ఇది ప్రత్యేకం. అంటే, మే 18న జరిగే మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడను న్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు పాయింట్ల పట్టికలో 3వ లేదా 4వ స్థానంలో కొనసాగుతుంది. అయితే, ఇప్పటికే 14 పాయింట్లతో ఉన్న %జూఖ%పై గొప్ప విజయం సాధిస్తేనే %=జదీ% టాప్-4 దశకు చేరుకోగలదు. %జూఖ% జట్టు నెట్ రన్ రేట్ ం0.528ని కలిగి ఉన్నందున, %=జదీ% జట్టు ఈ నెట్ రన్ రేట్‌ను అధిగమించి 14 పాయింట్లను సంపాదించాల్సి ఉంటుంది. ం0.387 నెట్ రన్ రేట్‌తో %=జదీ% ఎంత మార్జిన్‌తో %జూఖ%ని అధిగమించగలదు? దీని గురించి పూర్తి సమాచారం ఇప్పుడు చూద్దాం..%జూఖ%తో జరిగే మ్యాచ్‌లో %=జదీ% ముందుగా బ్యాటింగ్ చేస్తే 18 పరుగుల తేడాతో గెలవాలి. ఉదాహరణకు %=జదీ% స్కోర్ 200 పరుగులు చేస్తే, %జూఖ% తప్పనిసరిగా 182 లేదా అంతకంటే తక్కువ పరుగులకే పరిమితం చేయాలి. దీని ద్వారా కనీసం 18 పరుగుల విజయాన్ని సాధించాల్సి ఉంటుంది.%=జదీ% ముందుగా బౌలింగ్ చేస్తే, %జూఖ% కేవలం 18.1 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించాలి. ఉదాహరణకు, %జూఖ% 222 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిస్తే, %=జదీ% విజయం సాధించడానికి 18.1 ఓవర్లలో దానిని ఛేదించాల్సి ఉటుంది.ఈ రెండు లెక్కలతో %=జదీ% జట్టు %జూఖ%తో పోటీపడనుంది. ఈ తేడాతో గెలిస్తేనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాయింట్ల పట్టికలో చెన్నై సూపర్ కింగ్స్‌ను అధిగమించి ప్లేఆఫ్‌లోకి ప్రవేశించగలదు.

# చేజేతులా ఓడిన ఢిల్లీ.. టాప్- 5లో ఆర్సీబీ

ప్లే ఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారిన వేళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు వరుసగా ఐదో విక్టరీ కొట్టింది. కీలకమైన రెండు పాయింట్ల కోసం జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఢిల్లీ చిత్తుగా ఓడింది. తొలుత రజత్ పాటిదార్(52), విల్ జాక్స్(41) విధ్వంసంతో ఆర్సీబీ భారీ స్కోర్ చేయగా.. ఛేదనలో ఢిల్లీ ఆది నుంచి తడబడింది. బెంగళూరు బౌలర్లు, ఫీల్డర్ల జోరుతో వరుసగా వికెట్లు కోల్పోయి 140కే కుప్పకూలింది. కెప్టెన్ రిషభ్ పంత్ గైర్హాజరీలో పగ్గాలు అందుకున్న అక్షర్ పటేల్(57) అర్ధ శతకంతో చెలరేగినా ఢిల్లీని గెలిపించలేకపోయాడు. వరుసగా ఐదో విజయం నమోదు చేసిన డూప్లెసిస్ సేన 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని ఐదో స్థానానికి ఎగబాకింది. చిన్నస్వామి స్టేడియంలో రజత్ పాటిదార్(52), విల్ జాక్స్(41) మెరుపులతో ఆర్సీబీ 186 రన్స్ కొట్టింది. అనంతరం ఛేజింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. తొలి ఓవర్లోనే ఇంప్యాక్ట్ ప్లేయర్ డేవిడ్ వార్నర్(1) ఔటయ్యాడు. అతడితో మొదలు వచ్చిన వాళ్లు వచ్చినట్టు డగౌట్‌కు క్యూ కట్టారు. యశ్ దయాల్ ఓవర్లో నాన్ స్ట్రయికర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్(21) దురదృష్టం కొద్దీ రనౌట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు బంతికి అభిషేక్ పొరెల్(7) సులవైన క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆ తర్వాత సిరాజ్ బౌలింగ్‌లో కుమార్ కుషగ్ర(2) ఎల్బీగా దొరికాడు. దాంతో, 30 పరుగులకే ఢిల్లీ 4 వికెట్లు కోల్పోయింది.

**షాహ్ హెూప్(27)**

ఆ దశలో ఢిల్లీని గట్టున పడేసే బాధ్యత తీసుకున్న షాహ్ హెూప్(27), కెప్టెన్ అక్షర్ పటేల్(57)లు ఐదో వికెట్‌కు 56 రన్స్ జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని విడదీసిన ఫెర్గూసన్ ఢిల్లీని ఓటమి అంచుల్లోకి నెట్టాడు. గ్రీన్ ఓవర్లో లేని పరుగుకు ప్రయత్నించిన ట్రిస్టన్ స్టబ్స్(3) అనూహ్యంగా రనౌట్ కావడంతో 90 పరుగులకే ఢిల్లీ ఆరో వికెట్ పడింది.



**పట్టువదలని విక్రమార్కుడిలా..**

అయినా సరే.. అక్షర్ పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి ఢిల్లీ స్కోర్ 120 దాటించాడు. అయితే.. బంతి అందుకున్న దయాల్ అతడిని వెనక్కి పంపి ఆర్సీబీని గెలుపు వాకిట నిలిపాడు. ఆఖరి ఓవర్‌లో తొలి బంతికే దయాల్ .. కుల్దీప్ యాదవ్(6)ను బౌల్డ్ చేయడంతో 140 పరుగులకు ఢిల్లీ ఆలౌటయ్యింది. దాంతో, ఆర్సీబీ 47 పరుగుల తేడాతో గెలుపొంది ప్లే ఆఫ్స్ బరిలో నిలిచింది.

**పాటిదార్, జాక్స్ విధ్వంసం**

ప్లే ఆఫ్స్ ఆశలు సన్నగిల్లిన వేళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు చితక్కొట్టారు. చిన్నస్వామి స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లను ఉతికేస్తూ ఆర్సీబీ రజత్ పాటిదార్(52) విధ్వంసం సృష్టించాడు. 36 పరుగులకే ఫాఫ్ డూప్లెసిస్ (6), విరాట్ కోహ్లీ(27) లు వెనుదిరగడంతో ఒత్తిడిలో పడిన ఆర్సీబీని ఆదుకున్నాడు. అర్ధ సెంచరీతో చెలరేగిన పాటిదార్.. డేంజరస్ విల్ జాక్స్(41)తో 88 రన్స్ జోడించాడు. చివర్లో కామెరూన్ గ్రీన్(30 నాటౌట్) దంచడంతో, ఆర్సీబీ ప్రత్యర్థి ముందు 188 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఢిల్లీ బౌలర్లలో ఖలీల్ అహ్మద్(2/31), రసిక్ సలాం(2/23)లు రాణించారు.

# టీ20 క్రికెట్‌కు స్టార్ ఆల్‌రౌండర్ సీన్ విలియమ్స్ గుడ్‌బై..

జింబాబ్వే స్టార్ ఆల్‌రౌండర్ సీన్ విలియమ్స్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అయితే, టీ20 వరల్డ్ కప్‌కు ముందు ఆల్ రౌండర్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ నిర్ణయం ఆ జట్టుకు పెద్ద షాకింగ్ వార్తే. టీ20 ప్రపంచకప్ వెస్టిండీస్, అమెరికా వేదికగా జరుగనున్న విషయం తెలిసిందే. బంగ్లాదేశ్ గడ్డపై ఆతిథ్య జట్టుతో జరిగిన ఐదు మ్యాచుల టీ20 సిరీస్ ముగిసిన అనంతరం తన నిర్ణయాన్ని విలియమ్స్ ప్రకటించాడు. విలియమ్స్ బ్యాట్‌తో పాటు బంతితోనూ మ్యాజిక్ చేశాడు. విలియమ్స్ టీ20 అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నాడని.. మ్యాచ్ తర్వాత నిర్ణయాన్ని సహచరులకు తెలియజేశాడని జింబాబ్వే అధికారి ఒకరు తెలిపారు. 2006లో బంగ్లాదేశ్‌పై టీ20లో అరంగేట్రం చేసిన విలియమ్స్.. అదే జట్టుతో చివరి మ్యాచ్‌ను ఆడాడు. అంతర్జాతీయ టీ20ల్లో 81 మ్యాచ్‌ల్లో 23.48 సగటుతో 1691 పరుగులు చేశాడు. ఇక 6.93 ఎకానమీ రేటుతో 48 వికెట్లు పడగొట్టాడు. విలియమ్స్ వన్డేలు, టెస్టుల్లో కొనసాగనున్నాడు. ఇక బంగ్లాదేశ్‌తో జరిగిన ఐదుమ్యాచుల టీ20సిరీస్‌లో తొలినాలుగు మ్యాచుల్లో బంగ్లాదేశ్ విజయం సాధించింది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**